J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 45 11.04.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## అటు వార్నింగ్‌లు.. ఇటు వేధింపులు


# సమిధలవుతున్న అధికారులు

- నాయకుల మధ్య నలుగుతున్న ఉద్యోగులు
- చెప్పింది చేయకుంటే పాలకపక్షానికి కోపం
- చెప్పినట్లు చేస్తే ప్రతిపక్షానికి మనస్తాపం



గవర్నమెంట్ ఉద్యోగం అంటే గవర్నర్ గిరీ అంత దర్జా అంటారు పెద్దలు. భారీ జీతభత్యాలు, సంఘంలో గౌరవం, ఉద్యోగ భద్రత, అవసరమైనప్పుడు ఆమ్యామ్యాలూ వారి సొంతం. అందుకే విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత దాదాపు 90 శాతం మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల వైపే మొగ్గు చూపుతారు. ఇక ఉన్నత ఉద్యోగాలైన ఐఏఎస్, ఐపీఎస్ సాధించారంటే వారి జీవితం ధన్యమైనట్లే భావిస్తారు. ఒక్కసారి పోస్టు సాధించారంటే జిల్లాలో పనిచేసే ప్రభుత్వ యంత్రాంగం మొత్తం వారి కంట్రోల్‌లో ఉన్నట్లే లెక్క. ఇంతటి ప్రాధాన్యం, విశిష్టత ఉన్న కలెక్టర్‌లు, ఎస్పీలు, డీఐజీలు, ఐజీలు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా విధులు నిర్వహిస్తున్నారు. దీనికి కారణం తమకు అనుకూలంగా పని చేయాలని పాలకపక్షాలు ఒత్తిడి ఓ వైపు... నిబంధనలు అతిక్రమించి వేధింపులకు, అరెస్టులకు పాల్పడితే మేం ప్రభుత్వంలోకి వచ్చాక మీ అంతు చూస్తాం, మీ బట్ట లూడదీసి నిలబెడతాం, అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల హెచ్చరికలు మరోవైపు.

దీంతో "విడవమంటే పాముకు కోపం... కరవమంటే కప్పకు కోపం" అన్న చందంగా తమ పరిస్థితి తయారైందని, చివరికి ప్రభుత్వ ఉద్యోగం అంటేనే పులి మీద స్వారీగా మారిందని అధికారులు వాపోతున్నారు. ఇటీవల సత్యసాయి జిల్లాలో పర్యటించిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పోలీసుల బట్టలూడదీసి నిలబెడతానని అనుచిత వ్యాఖ్యలు చేయడం, దానికి రామగిరి ఎస్ఐ ధీటుగా స్పందించడంతో అధికారులపై ఒత్తిళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ..2లో



## వెంటాడుతున్న కేసులు.. వేటాడుతున్న పోలీసులు

# కలుగులో కాకాణి!

కలుగులో వున్న ఎలుకలు, పందికొక్కులు బయటకి వచ్చాయంటే నానా రొచ్చు చేస్తాయి. దొరికిన మేరకు తినేస్తాయి. తమ ఇష్టారాజ్యాంగ విధ్వంసం సృష్టిస్తాయి. కర్ర చేతబట్టి తరుముకుంటే మళ్ళీ కలుగులోకి వెళ్ళి దాక్కుంటాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అనేకమంది వైసీపీ నాయకుల పరిస్థితి అలాంటిదే. అధికారం చేతిలో వుంది కదా అని.. ఆ పార్టీ నేతలు గత ప్రభుత్వ పాలనలో అడ్డమైన గడ్డీ తిన్నారు. మనల్ని అడిగేదెవడులే... అన్న అహంకార ధోరణితో వ్యవహరించారు. 'దోపిడీకి కాదేది అనర్హం' అన్నట్లుగా అడ్డగోలుగా దోచుకున్నారు. నోరుందికదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. గుట్టుగా సంసారం చేసుకునే మహిళలని సైతం వదలకుండా దూషణల పర్వం కొనసాగించారు. స్థాయి మరచి బజారు మాటలతో ప్రత్యర్థులని తిట్టి పోశారు. వాటన్నిటి ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నారు. అప్పటి ప్రవర్తన పర్యవసానం ఇప్పుడు రుచి చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం బనాయిస్తున్న కేసులతో కొందరు జైళ్ళ పాలైతే, మరికొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంకొందరు కలుగుల్లో దాక్కొంటున్నారు.

## మనిషి క్లాస్.. మాటలు ఊర మాస్!

మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పరిస్థితి కూడా అలాంటిదే. ఆయన 2014 నుండి 2024 వరకూ పదేళ్ళ పాటు శాసనసభ్యుడిగా ఉన్నాడు. అందులో అయిదేళ్ళు అధికారపార్టీ ఎంఎల్‌ఏగా అధికారం చెలాయించాడు. రెండేళ్ళు మంత్రిగా కూడా రాజ్యమేలాడు. అధికార పార్టీ శాసనసభ్యుడిగా, మంత్రిగా ఆయన ఆగడాలకు అడ్డూఆపూ లేకుండా ప్రవర్తించాడు. తనకి తిరుగులేదన్నట్లుగా వ్యవహరించాడు. ఏకపక్ష ధోరణితో నియోజక వర్గంపై పెత్తనం చెలాయించాడు. ప్రత్యర్థులపై అసభ్య పదజాలంతో నోరు పారేసుకున్నాడు. అత్యంత జుగుప్సాకరమైన బజారు భాషతో వ్యక్తిగత దూషణలకు తెరలేపాడు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆయనపై దృష్టిపెట్టి ఆయన పనిపట్టే ప్రయత్నాలు మొదలుపెడితే, ఆయన కూడా కలుగులో దాక్కున్నాడు.

### ఇదీ కాకాణి రాజకీయ నేపథ్యం..!

నీతి నిజాయతీలకి, నిఖార్సైన రాజకీయాలకి, ఆనం కుటుంబంపై విధేయతకి నిలువెత్తు నిదర్శనం స్వర్గీయ కాకాణి రమణారెడ్డి. ఆయన వారసుడిగా రెండు దశాబ్దాల క్రితం జిల్లా రాజకీయాలలో ఆరంగేట్రం చేశాడు కాకాణి గోవర్ధనరెడ్డి. ఆనం సోదరుల అండతో దివంగత మహా నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా కాకాణి పగ్గాలు చేపట్టాడు. ఆనాడు కూడా ఆయన ప్రత్యక్ష ఎన్నికలలో పోటీచేయలేదు. తన సమీప బంధువు, ప్రస్తుత రూరల్ శాసనసభ్యుడు 10లో



## స్థలం చూపించండి...
# ఆనం వివేకా విగ్రహం ఏర్పాటు చేద్దాం

**కార్పొరేషన్ కమిషనర్‌కి కోటంరెడ్డి వినతి**



నెల్లూరు మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు ప్రజలకు సుదీర్ఘకాలం సేవలందించిన దివంగత నేత ఆనం వివేకానందరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కృషి ప్రారంభించారు. నెల్లూరు మునిసిపల్ ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా, కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా ఆనం వివేకా ఎనలేని సేవలందించారని, నెల్లూరు శాసనసభ్యులుగా రెండుసార్లు, నెల్లూరు రూరల్ శాసనసభ్యునిగా ఒక పర్యాయం ఆయన ఎన్నికై, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని, అలాంటి నాయకుని సేవలు చిరకాలం జ్ఞాపకం ఉంచుకునే విధంగా నెల్లూరు నగరంలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటుచేస్తే బావుంటుందని శ్రీధర్‌రెడ్డి భావిస్తున్నారు. ఇది మనందరి బాధ్యతగా తాను భావిస్తున్నానని, కాంస్య విగ్రహం ఏర్పాటుకు తాను సిద్ధమని ఆయన ఈనెల 9న నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజను కలిసి విన్నవించారు. విగ్రహం ఏర్పాటుకు సంబంధించి స్థలం మీరు కేటాయిస్తే, తన సొంత ఖర్చులతో వివేకా విగ్రహం ఏర్పాటుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పారు. వివేకా కుటుంబసభ్యులను, అభిమానులను, వారితోపాటు సుదీర్ఘకాలం రాజకీయాల్లో ప్రయాణం సాగించిన వారిని కూడా కలుపుకుని ఈ కార్యక్రమం చేపట్టాలన్నది తన ఆకాంక్ష అని ఆయన తెలిపారు. అయితే, ఈ విషయంలో ఆనం వివేకా కుటుంబసభ్యులదే తుది నిర్ణయమని, మీరు పూర్తి బాధ్యత తీసుకుని వారి కుటుంబసభ్యులతో చర్చించి త్వరితగతిన విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఆయన కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తన సోదరుడు..టీడీపీ నాయకుడైన..కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా ఉన్నారు.

## గోవిందరాజు సీతాదేవి
# పురస్కారాల విజేతలు

ప్రముఖ నవలా రచయిత్రి గోవిందరాజు సీతాదేవి స్మారక జాతీయస్థాయి సాహితీ పురస్కారాలు-2024కి విజేతలు ఎంపికైనట్లు ఆ సాహితీ వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి ఈనెల 10న ఒక ప్రకటనలో తెలియజేశారు. నవలా విభాగంలో ఆర్‌సి కృష్ణస్వామిరాజు రచించిన 'మేకలబండ' నవల, కె.ఏ మునిసురేష్‌పిళ్లై రచించిన 'గారడీవాడు' కథా సంపుటిలకు అవార్డులు వచ్చాయని, త్వరలో నెల్లూరులో జరిగే కార్యక్రమంలో వారికి ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామని ఆమె వివరించారు.

## సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి..
# రెండున్నర లక్షల విరాళం



ఆర్మీలో హవాల్దార్‌గా పనిచేసిన వి.యస్.కృష్ణమూర్తి-సీతల కుమారుడు శ్రీనివాసశాస్త్రి జ్ఞాపకార్థం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సీత తమ విరాళంగా 2 లక్షలా 50 వేల రూపాయల చెక్కును జిల్లా సైనిక్ బోర్డు ఛైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు. ఈనెల 8న కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి ఆ చెక్కును ఇచ్చారు. దాత సీతతో పాటు జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.హరికృష్ణ పాల్గొన్నారు.

# గ్యాస్ ధర పెంపుపై సీపీఎం ఆందోళన



కేంద్రప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి పేదలు, మధ్య తరగతి ప్రజలకు పెనుభారం మోపిందని, ఈ ధరల పెంపు దారుణమంటూ నెల్లూరులో సీపీఎం గ్రామీణ మండల నాయకులు ఈనెల 8న నిరసన వ్యక్తం చేశారు. స్థానిక వేదాయపాళెం వద్ద ధర్నా నిర్వహించి, గ్యాస్ ధరలపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు కొండా ప్రసాద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమిధలవుతున్న అధికారులు

(మొదటిపేజీ తరువాయి)

### గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. 2019 ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదుచేసి వారు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా చూడాలని కోరారు. ఫలితంగా అప్పట్లో ఇంటిలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు, కడప ఎస్పీ రాహుల్‌దేవ్ వర్మ, శ్రీకాకుళం ఎస్పీ వెంకటరత్నంను ఈసీ ఎన్నికల విధులకు దూరంగా ఉండేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం పలువురు అధికారులను టార్గెట్ చేసింది. వారిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త అన్న రీతిలో వ్యవహరించారంటూ ఏబీ వెంకటేశ్వరరావుకు పోస్టింగు, జీతభత్యాలు ఇవ్వకుండా ముప్పతిప్పలు పెట్టింది. పైగా భద్రతా పరికరాల కొనుగోలులో అక్రమాలకు పాల్పడ్డారంటూ సస్పెండ్ చేసింది. దీంతో ఆయన హైకోర్టు, సుప్రీంకోర్టు, కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) చుట్టూ ఏళ్లతరబడి ప్రదక్షిణలు చేసి చివరికి ఎలాగో ఉద్యోగ విరమణ చేశారు. ఇదే తరహాలో కొందరు డీఎస్పీలు, ఆర్డీఓలు, తాసీల్దార్లు, ఎంపీడీవోలు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారనే ఆరోపణలున్నాయి.

2024 ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రతిపక్షంలోకి వచ్చిన వైసీపీ ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు కూటమి నేతలకి వంతపాడుతున్నారని తరచూ ఆరోపిస్తున్నారు. అలాంటి అధికారులని బట్టలూడదీసి నిలబెడతానంటూ పోలీసు శాఖని ఉద్దేశించి స్వాక్షాత్తూ వైఎస్ జగన్ వ్యాఖ్యానించడం గమనార్హం. సత్యసాయి జిల్లాలో తమ కార్యకర్త హత్యకు కూటమి నాయకులు కారణమని, అయినా పోలీసులు వారికి చెంచాగిరి చేస్తున్నారని జగన్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటూ ఏకపక్షంగా పనిచేస్తున్న పోలీసులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. దీనిపై స్థానిక ఎస్ఐ సుధాకర్ స్పందిస్తూ పోలీసులు విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరిస్తున్నారని, జగన్ ఊడదీయనికి పోలీస్ యూనిఫాం అరటి తొక్కకాదని ధీటుగా బదులివ్వడం సంచలనంగా మారింది. పెద్ద పెద్ద ఆఫీసర్లే మిన్నకుండి పోతున్న తరుణంలో ఓ సాధారణ ఎస్ఐ అధికారుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారనే పోస్టులు ప్రస్తుతం సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నాయి.

### కూటమి ప్రభుత్వంలో..

ఇక వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆయనకు వీరవిధేయులుగా వ్యవహరించి, తెలుగుదేశం కార్యకర్తలను వేధించిన అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని యువగళం పాదయాత్రలో ఆ పార్టీ నేత లోకేష్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. అక్రమ కేసులను బనాయించిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాస్తున్నట్లు ప్రకటించి సంచలనం రేపారు. ఇక 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెడ్‌బుక్‌లోని వివరాల ఆధారంగా నాయకుల అరెస్టులు, అధికారుల సెస్పెన్షన్లు, బదిలీలు చకచకా సాగిపోయాయి. తొలుత ఏకంగా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరించారంటూ 16 మంది ఐపీఎస్‌లకు రెండు నెలల పాటు ప్రభుత్వం పోస్టింగ్‌లే ఇవ్వలేదు. పైగా వారు రోజూ డీజీపీ ఆఫీస్‌కి వచ్చి సంతకం చేసి వెయిట్ చేసేలా ఆదేశాలిచ్చింది. తర్వాత మార్గదర్శి కేసుల్లో, చంద్రబాబు అరెస్టు సమయంలో కీలకంగా వ్యవహరించిన ఎన్.సంజయ్, కొల్లి రఘురామరెడ్డి సహా కాంతిరాణా టాటా, జి.పాల్‌రాజ్, అమ్మిరెడ్డి, విశాల్‌గున్ని, అన్బురాజ్, రిషాంత్‌రెడ్డి, పి.పరమేశ్వర్‌రెడ్డి, కె.రఘువీరారెడ్డి, వి.రవిశంకర్‌రెడ్డి, కృష్ణకాంత్ పాటిల్, పి.జాషువ తదితరులను టార్గెట్ చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అదే సమయంలో ఓ పారిశ్రామికవేత్తకు సహాయం చేసే క్రమంలో ఒక బాలీవుడ్ నటి, ఆమె కుటుంబసభ్యులను అక్రమ కేసులతో వేధించారంటూ ఇంటెలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, విజయవాడ సీపీ కాంతిరాణా టాటా, డీసీపీ విశాల్ గున్నిని సస్పెండ్ చేసింది. ఇలా ఓ కేసులో ముగ్గురు ఐపీఎస్‌లపై వేటు వేయడం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి కావడం గమనార్హం. ఇక తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా వ్యవహరించిన సునీల్‌కుమార్ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లారని, తద్వారా కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఆయన ఉల్లంఘించారంటూ కూటమి ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది.

### తెలంగాణలో..

ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణలోనూ అధికారుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ తరహాలోనే తయారయ్యింది. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో కొందరు అధికారులు కేసీఆర్‌కు, కేటీఆర్‌కు, హరీష్‌రావ్‌కు తొత్తుల్లా వ్యవహరించి కాంగ్రెస్ బీజేపీ నాయకులను చిన్నచూపు చూశారనే వాదనలున్నాయి. దీంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అలాంటివారికి పోస్టింగ్‌లు కేటాయించకపోవడమే కాకుండా, సస్పెండ్ చేసింది. ఇదే క్రమంలో పలువురు బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులను కూడా అరెస్టు చేసింది. దీంతో అప్పటి వరకు ఐఏఎస్, ఐపీఎస్‌లను కాంగ్రెస్ వేధిస్తోందని ఆరోపించిన బీఆర్ఎస్, పాలకుల మాటలు విని తమ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న అధికారుల పేర్లను పింక్‌బుక్‌లో రాస్తున్నామని హెచ్చరించింది. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వారి అంతు చూస్తామన్న బెదిరింపులకు తెరలేపింది.

### నిజాయితీపరులకి గుర్తింపు కరువు!

నిజానికి ఐఏఎస్, ఐపీఎస్ సాధించడమన్నది చాలా కష్టమైనపని. లక్షల మందితో పోటీపడి ఏళ్లతరబడి చదివి సాధించాల్సిన టార్గెట్ అది. అలాంటిది పోస్టింగ్ వచ్చిన తర్వాత కొందరు అధికారులు తాము ఉద్యోగంలో చేరేటప్పుడు చేసే ప్రమాణాలకు నీళ్లొదిలేస్తూ, స్వార్థప్రయోజనాల ప్రాతిపదికగానే పని చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చాలా తక్కువమంది మాత్రమే పక్షపాతానికి, భయానికి, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తున్నారన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. అయితే ఇలాంటి వారికి ప్రభుత్వాలు, నాయకులు ఏమాత్రం ప్రాధాన్యమివ్వడం లేదని విశ్లేషకులు చెప్తున్నారు. తమ అడుగులకు మడుగులొత్తే అధికారులనే అందలం ఎక్కిస్తున్నారని ఫలితంగా నిజాయితీ పరులైన అధికారులు తగినంత అనుభవం ఉన్నా పోస్టింగ్‌లలో వెనుకబడి పోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కాలక్రమేణా వారు కూడా సర్దుబాటు మనస్తత్వంలో విధులు నిర్వహించే పరిస్థితి దాపురిస్తోందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

### ముక్కుసూటి అధికారులకు బదిలీలే బహుమానం..

ఇక వివిధ రాజకీయ పార్టీ నాయకులకు, సంస్థల ప్రతినిధులకు, డబ్బు, మగువ, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా నిక్కచ్చిగా ముక్కుసూటిగా విధులు నిర్వహించే అధికారులకు బదిలీలే బహుమానంగా మారుతున్నాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. తమిళనాడులో నిజాయితీకి మారు పేరుగా నిలిచి 20 ఏళ్లలో 20సార్లు బదిలీ అయిన ఐఏఎస్ అధికారి యు.సగాయం ఓ సందర్భంలో వ్యాఖ్యానిస్తూ, తన జీవితకాలంలో ప్రభుత్వాలు ఏడాది పాటు ఎక్కడా స్థిరంగా తనకి పోస్టింగ్ ఇవ్వలేదని, ప్రతి ఆరునెలలకు ఒకసారి బదిలీ తనకు బహుమానంగా దక్కిందని వాపోవడం గతంలో సంచలనంగా మారింది. ఇదే నిజం కూడా. పొలిటికల్ బాస్‌ల ప్రాపకం కోసం పాకులాడుతూ "అయ్యా ఎస్" అనే అధికారులకున్న విలువ, క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేసే వారికి లేకుండా పోతోంది. ఈ పరిస్థితి మారాలంటే రాజకీయ ఛత్రంలో నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లను తప్పించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. సహేతుకమైన కారణం లేకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లను ఒక నిర్ణీత సమయంలోపు బదిలీచేసే అధికారం ప్రభుత్వాలకు కల్పించకూడదని విశ్లేషకులు సూచిస్తున్నారు. అదే సమయంలో అధికారి తప్పు చేస్తే శాశ్వతంగా ఉద్యోగానికి దూరమయ్యే విధంగా నిబంధనలు రూపొందించినప్పుడే అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు. ఏదేమైనా రోజురోజుకూ కురుక్షేత్ర సంగ్రామంగా మారుతున్న, రాజకీయ క్రీడలో విధినిర్వహణ అన్నది అధికారులకు కత్తిమీద సామే. ఎంత జాగ్రత్తగా ఉన్నా ఏదో ఒక చోట కత్తిగాయం తప్పకపోవచ్చు. అందుకే చిక్కడు - దొరకడు తరహాలో చాలామంది అధికారులు డబుల్‌రోల్ పోషిస్తూ అటు పాలకపక్షాన్ని, ఇటు ప్రతి పక్షాన్ని మేనేజ్ చేస్తూ కాలం గడపేస్తున్నారు. ఎటొచ్చి నిజాయితీ పరులకే ఎప్పుడూ సమస్యలు అంటే అతిశయోక్తి కాదేమో. అయితే నాయకుల్లో నైతికత, అధికారుల్లో ఆత్మవిమర్శ రానంత వరకు ఈ సమస్యకు పరిష్కారం ఎండమావే అన్నది కాదనలేని సత్యం. చెప్పింది చెప్పినట్లు చేయకపోతే అధికార పక్ష నాయకులకి కోపం. వాళ్ళు చెప్పినట్లు చేస్తే ప్రతిపక్ష నేతలకి మనస్తాపం. ఇద్దరినీ సంతృప్తి పరచలేక పోవడం అధికారుల పాలిట శాపం..!

## కోవూరు చక్కెర ఫ్యాక్టరీ సమస్యల పరిష్కారానికై..

# కలెక్టర్‌తో భేటీ అయిన ప్రశాంతిరెడ్డి



కోవూరు చక్కెర ఫ్యాక్టరీకి సంబంధించి కార్మికులకు, రైతులకు చెల్లించాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రకటించారు. ఆమె రైతు సంఘం నాయకులతో కలిసి ఈనెల 7న జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో భేటీ అయ్యారు. చక్కెర ఫ్యాక్టరీ భవిష్యత్‌పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, కోవూరు చక్కెర కర్మాగారం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. కార్మికులకు బకాయి ఉన్న 24కోట్ల రూపాయలను చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. చక్కెర ఫ్యాక్టరీకి చెందిన 124 ఎకరాల భూములను ఏపీఐఐసికి అప్పగించి, పరిశ్రమలు ఏర్పాటుచేయడం ద్వారా ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కలుగుతాయని ప్రశాంతిరెడ్డి చెప్పారు.

## 50 లక్షల సొంతనిధులతో..

# షాదీమంజిల్ కట్టిస్తా!

### - మంత్రి నారాయణ



నిరుపేద ముస్లిం మైనార్టీలు శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు రూ.50 లక్షల సొంత నిధులతో.. వారి కోసం షాదీమంజిల్ కట్టిస్తామని రాష్ట్ర పుర పాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల9న ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరం అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికల సమయంలో 54వ డివిజన్‌లో తాను పర్యటించినప్పుడు స్థానిక ప్రజలకు షాదీ మంజిల్ నిర్మించి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ మాటను నెరవేర్చబోతున్నామని, షాది మంజిల్ నిర్మాణం త్వరలో ప్రారంభిస్తా మని ఆయన అంటూ, అందుకోసం తన సొంత నిధుల నుండి 50 లక్షల రూపా యలు కేటాయించామన్నారు. నెల్లూరు నగరంలో రోడ్లు, డ్రెయిన్లు బాగాలేక ప్రజలు నానారకాల ఇబ్బందులు పడు తున్నారని, ఆ కష్టాలు తీర్చేందుకు రూ.37 కోట్ల నిధులతో డ్రైనేజీలు, రోడ్లను బాగు చేయిస్తామని మంత్రి తెలిపారు. నెల్లూరు ప్రజలకు కేవలం రెండు రూపాయలకే 20 లీటర్ల స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు కూడా చేపడతామన్నారు. రూ.4.8 కోట్లతో ఎన్టీఆర్ సుజల స్రవంతికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సూర్య తేజ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రూరల్‌లో మరో పాఠశాల!

నిరుపేదల పిల్లలకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్య అందించేందుకు ఈ విద్యా సంవత్సరం నుండి వీఆర్‌సి పాఠశాల పునః ప్రారంభిస్తామని, అదేవిధంగా నెల్లూరురూరల్‌లో కూడా మరో పాఠశాలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ వెల్లడించారు. ఈనెల 9న ఆయన నెల్లూరులోని వీఆర్‌సి కాంపౌండ్‌లో జరుగుతున్న పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలోని జాఫర్‌సాహెబ్ కెనాల్, సర్వేపల్లి కెనాల్, తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద పిల్లల కోసం ఈ పాఠశాలను ప్రారంభిస్తున్నామన్నారు.

# జయభారత్ ఆసుపత్రికి.. డిజిటల్ ఎక్సరే యంత్రం బహూకరణ



నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి శ్రీ రాఘవ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పొన్నలూరు సీతారామరెడ్డి, వారి సతీమణి జ్యోతిరెడ్డి, ఏడు లక్షల రూపాయలను విరాళంగా అందించారు. సీతారామరెడ్డి అమ్మానాన్నలు కీర్తి శేషులు పొన్నలూరు వీరరాఘవరెడ్డి – రాజేశ్వరమ్మల జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని చెక్ రూపంలో జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్‌కి అందజేశారు. ఈ మొత్తాన్ని ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే యంత్రం కోసం వినియోగించవలసిందిగా పొన్నలూరు సీతారామరెడ్డి కోరారు. ఈ నెల 10న, గురువారం నాడు డిజిటల్ ఎక్సరే యంత్రాన్ని కూడా దాతే ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారామరెడ్డి మాట్లాడుతూ, గతంలో కూడా పలు సందర్భాల్లో ఈ ఆసుపత్రికి తమ ట్రస్ట్ తరపున సహాయ సహకారాలు అందించామని తెలిపారు.

### జైన్ చారిటబుల్ ట్రస్ట్.. 7 లక్షల విరాళం

శ్రీ భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ వారు కూడా ఈనెల 10న గురువారం నాడు 7లక్షల రూపాయల చెక్కును ఆసుపత్రి ట్రస్ట్ ఛైర్మన్ పొన్నలూరు సీతారామరెడ్డికి అందజేశారు. ఆసుపత్రికి అవసరమైన అంబులెన్స్‌ను కొనుగోలు చేయడం కోసం వారు ఈ మొత్తాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జెపి జైన్ మరియు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. తమ ట్రస్ట్ ద్వారా జయభారత్ ఆసుపత్రికి గతంలో 20 యూనిట్లతో డయాలసిస్ విభాగాన్ని ఏర్పాటుచేయడం జరిగిందని, అదే విధంగా ఐసియు ఆధునీకరణ కూడా చేపట్టినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

# కాలేయ వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దు

### ప్రముఖ కాలేయమార్పిడి నిపుణులు డాక్టర్ రజనీకాంత్



కాలేయ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనలతో తగు చికిత్సలు చేయించుకోవాలని చెన్నై గ్లెనిగల్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రజనీకాంత్ చెప్పారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9న నెల్లూరులోని గ్లెనిగల్స్ హాస్పిటల్స్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మితిమీరిన మద్యపానం, హెపటైటిస్-బి, సి వైరస్‌లు, ఊబకాయం, జన్యుపరమైన కారణాలతో కాలేయ వ్యాధులు వస్తుంటాయని తెలిపారు. కాలేయవ్యాధుల పట్ల అందరూ అవగాహన కలిగించుకోవాలని ఆయన సూచించారు. ఈ వ్యాధులకి మంచి వైద్యం అందుబాటులో ఉందన్నారు. ఒకవేళ కాలేయం చెడిపోతే కాలేయమార్పిడి అత్యవసరమన్నారు. కాలేయమార్పిడిలో మూడు రకాల పద్ధతులున్నాయని ఆయన చెప్పు, ప్రస్తుతం కాలేయమార్పిడి చికిత్సలు అందరికీ అందుబాటులో ఉన్నాయన్నారు. నెల్లూరుజిల్లాకి చెందిన సుమారు 50 మందికి తాము కాలేయమార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేశామన్నారు. ఈ శస్త్రచికిత్సల్లో తమ ఆసుపత్రి నూతన ఒరవడి సృష్టిస్తోందన్నారు. తాము కాలేయమార్పిడి చేసిన వారందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆయన చెప్పారు.


శ్రద్ధాంజలి



జననం 01.07.1938 మరణం 13.04.2021

పెద్దలు, స్ఫూర్తిప్రదాతలు

కాటంరెడ్డి వేణుగోపాలరెడ్డి గారు

పరమపదించి తే. 13.04.2025ది నాటికి నాలుగేళ్ళు గడవనున్నాయి.
వారి 4వ వర్ధంతి సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ..

కాటంరెడ్డి హంసవేణి - భార్య

కుమార్తెలు - అల్లుళ్ళు

కందల ప్రశాంతి - కందల బాబా ప్రసాద్‌రెడ్డి
జక్కా లక్ష్మీప్రసన్న - జక్కా శివనారాయణరెడ్డి
యేటూరు ప్రవీణ - యేటూరు వసుధర్‌రెడ్డి

మనుమలు మనుమరాళ్ళు

గిరిధర్‌రెడ్డి, గౌతమి, కళ్యాణ్‌రంగారెడ్డి, స్వాతి, శ్వేత
సందీప్‌రెడ్డి, శ్రేయ

మరియు ఇతర కుటుంబసభ్యులు

లాయర్
ఏప్రిల్ 11, 2025

# మండుతున్న ఎండలు.. పొంచివున్న అగ్నిప్రమాదాలు!

వేసవి వచ్చిందంటే చాలు.. ఎండలు భగ్గుమంటుంటాయి. భూతాపం పెరిగిపోయి..వాతావరణం వేడెక్కిపోతుండడంతో గతంలోకన్నా ఎండలు మరింత బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో బయట వేడి-ఇంట్లో సెగతో ప్రజలు నానా రకాల అవస్థలు పడుతుంటారు. ఈ బాధలు చాలవన్నట్లు మరోవైపు అగ్నిప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. అందులోనూ ఈ ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత భయంకరంగా ఉంటాయి. ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో చెప్పలేం. ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన కాలమిది. అది షార్ట్ సర్క్యూట్ కావచ్చు..లేదా మరేదైనా కారణంతో జరిగే ప్రమాదం కావచ్చు..ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిందే. దేశంలో ప్రతిఏటా అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతోమంది చనిపోతున్నారు కూడా. ఒక్క 2022 సంవత్సరం లెక్కలు చూసినా, మనదేశంలో 7500కి పైగానే అగ్ని ప్రమాదాలు జరిగాయని, వాటివల్ల 7435 మంది ప్రాణాలు కోల్పోయారని భారత నేర గణాంక నివేదికలు చెప్తున్నాయి.

సాధారణంగా విద్యుత్ సమస్యలతోనే ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయని నిపుణులు చెప్తుంటారు. వాటిలో షార్ట్ సర్క్యూట్‌తో జరిగే ప్రమాదాలే అత్యధికంగా ఉంటున్నాయి. ఇళ్ళలోనూ, ఇళ్ల బయటా అన్నిచోట్ల విద్యుత్ నిత్యావసరం కనుక, ఎక్కడ చూసినా విద్యుత్ వైర్లు, పరికరాలు ఉంటాయి. వాటితో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి. అదేవిధంగా, వంట చేసేటప్పుడు పరధ్యానంగా ఉండడం, స్టవ్ వెలిగించి చెవిలో సెల్‌ఫోన్ మీద మనసుపెట్టడం వంటివి మంచిది కాదు. ఇళ్లలోనూ, దేవుడి గదుల్లోనూ దీపాలు వెలిగించి వెళ్లిపోవడం వల్ల పొరపాటున అవి గాలికి అంటుకోవచ్చు. పొరపాటున నిప్పు రవ్వలు పడితే తాటాకుల ఇళ్లు, గడ్డివాములు వగైరాలన్నీ భస్మీపటలం అవుతుండడం తెలిసిందే. టపాసుల దుకాణాలు, తయారీ కేంద్రాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి. పేలుడు పదార్థాలను నిల్వ ఉంచుకోవడం మరీ ప్రమాదకరం. ఈ ఎండల్లో వేడికి వాటిలో మంటలు పుట్టే ప్రమాదం ఎంతైనా ఉంటుంది. అంతేకాదు, పొరపాటున వాటికి ఏ నిప్పురవ్వో అంటుకుంటే పరిస్థితి మన చేతిలో ఉండదు. ఇళ్లలోనే కాదు, దుకాణాలు, పెద్దపెద్ద షాపింగ్‌మాల్స్, కార్యాలయాలు, ఆసుపత్రులు, కర్మాగారాలు ఇలా ఒకటేమిటి అన్నిచోట్లా అగ్నిప్రమాద నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. గుడిసెల్లోనే కాదు, పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లకు కూడా అగ్నిప్రమాదాలు పొంచే ఉంటాయి. ప్రతి అంతస్తులో ప్రమాదాల బారినుంచి వెంటనే బయటపడడానికి మార్గాలుండాలి. ప్రమాద సమయాల్లో అత్యవసరంగా కావాల్సిన అగ్నిమాపక కేంద్రాలు, సమీపంలోని పోలీస్‌స్టేషన్ల ఫోన్‌నంబర్లను అందరూ ఎల్లవేళలా అందుబాటులో ఉంచుకోవాలి. అయితే, మనదేశంలో మరొక దుస్థితి ఏమంటే, ప్రజల ఆస్తులను, ప్రాణాలను కాపాడే అగ్నిమాపక కేంద్రాలు అత్యంత దయనీయ స్థితిలో ఉండడం. ఇప్పటికీ అధికశాతం కేంద్రాల్లో వాహనాల కొరత, పాత వాహనాలతోనే కాలం గడుపుతుండడం, ఆ కేంద్రాలకు అవసరమైన వసతులేమీ లేకపోవడం వంటి దురవస్థలు ఎంతోకాలం నుంచి ఉన్నాయి. ప్రతి మండల కేంద్రంలో నేటికీ అవసరమైన అగ్నిమాపక కేంద్రాలు లేవు. దూరప్రాంతాల నుంచి అగ్నిమాపక దళాలు వచ్చేసరికి, అన్నీ అగ్నికి ఆహుతైపోతుంటాయి.

మనదేశంలో అగ్నిమాపక సిబ్బంది ధైర్యసాహసాలను గౌరవించడానికి, 1944 నాటి అత్యంత విషాదకరమైన బాంబే డాక్ పేలుడుతో జరిగిన అగ్నిప్రమాదాన్ని గుర్తుంచుకుని, గత ప్రమాదాల నుంచి పాఠాలు నేర్చుకుని, భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తల గురించి తెలుసుకునేందుకు ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవాలు ప్రజలకు ఎంతో ఉపకరిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అగ్నిప్రమాదాల నుంచి మన భద్రతకు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ఎన్నో అంశాలను అగ్నిమాపక సిబ్బంది ఈ సందర్భంగా వివరిస్తుంటారు కూడా. వాస్తవానికి, ప్రాణాలకు తెగించి బాధితులను రక్షించే సాహసోపేతమైన వ్యవస్థ అగ్నిమాపక వ్యవస్థే. కానీ దేశంలోని అనేక కేంద్రాలకు అంకితమై పనిచేసే సిబ్బందికి మాత్రం..చాలినంత జీతాలు కూడా ఉండడం లేదు. ఇకనైనా ఈ సమస్యలన్నిటినీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సమీక్షించాలి. అగ్నిమాపక కేంద్రాల స్థితిగతులను పూర్తిస్థాయిలో పరిశీలించి, వాటికవసరమైన సిబ్బందిని, వాహనాలను, యంత్రపరికరాలను లోటు లేకుండా అందించి.. వాటిని మరింతగా బలోపేతం చేస్తూ.. ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి!...

**(ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు..అగ్నిమాపక సేవా వారోత్సవాలు)**




# కొనఊపిరితో ఊగిసలాడుతున్న వంతెనలు

మన దేశంలో బ్రిటిష్ కాలానికంటే ముందు నుండీ అనేక మార్గాల్లో వంతెనలు వున్నాయి. రవాణా వ్యవస్థలో ఈ వంతెనలది అత్యంత కీలకపాత్ర. చిన్నసైజు కాలువల నుండి మహా నదులనే కాకుండా సముద్రాలను సైతం దాటడానికి వంతెనలు ఉపకరిస్తాయి. పర్వత ప్రాంతాలలో సైతం ఓ చోటనుండి మరో చోటుకి వెళ్ళడానికి ఈ వంతెనలే ఆధారం అని చెప్పడానికి సందేహించనవసరం లేదు. ద్విచక్ర వాహనాల మొదలు రైళ్లతో సహా, అన్ని రకాల వాహనాలను సరైన సమయానికి గమ్యస్థానానికి చేర్చడంలో రోడ్లతో పాటు వంతెనలది కూడా ప్రధాన పాత్రే. వాహనాల రాకపోకలకు అనువుగా నిర్మితమైన పలు రకాల వంతెనలు దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలోనే ఉంటాయని చెప్పొచ్చు. చిన్న పల్లెటూర్లు మొదలుకుని పట్టణాలు, నగరాలలో వంద సంవత్సరాలకి పైబడిన వయస్సు కలిగిన వంతెనలు కోకొల్లలుగా వున్నాయి. వాటిలో చాలావరకూ నేటికీ చెక్కు చెదరకుండా సేవలందిస్తున్నాయంటే అతిశయోక్తి కాదేమో. పలానా వంతెన పలానా రాజు కట్టాడనో లేదా బ్రిటిషోళ్ళ టైంలో కట్టారనో మనం అప్పుడప్పుడు, అక్కడక్కడా వింటూనే ఉంటాం. ఆనాటి నిర్మాణాలలో వున్న సాంకేతిక నైపుణ్యత, నాణ్యతలకి సాక్షీభూతాలుగా సదరు వంతెనలు ఈనాటికీ సేవలందిస్తూ మన కళ్ళముందు కనిపిస్తున్నాయి.

అయితే, కాలక్రమేణా కొన్ని వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని పూర్తిస్థాయిలో దెబ్బతినిపోయి ఏ క్షణమైనా కూలిపోతాయన్నట్లుగా దర్శనమిస్తున్నాయి. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. దేశ వ్యాప్తంగా చాలాచోట్ల అవి అవసానదశకి చేరి, అత్యంత ప్రమాదభరితంగా తయారయ్యాయి. మన ప్రభుత్వాలు వాటి బాగోగులను పట్టించుకోవడం లేదు. వాటి స్థానంలో కొత్త వంతెనలు కట్టే ఆలోచన లేకపోయినా, కనీసం ఉన్నవాటిని బాగు చేసుకునేందుకు కూడా మన పాలకులు, అధికారులు చొరవ చూపకపోవడం బాధాకరం!..

## మన రాష్ట్రంలోనూ ఇదే దుస్థితి :

వంతెనల విషయంలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. చాలాప్రాంతాల్లో పాతకాలపు వంతెనల మీదుగానే ఇప్పటికీ వాహనదారులు ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. సదరు వంతెనలు దాటేటప్పుడు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వాటిని దాటుతున్నారు. రక్షణ గోడలు దెబ్బతిని, రాళ్ళు రాలిపోయి, పెచ్చెలు ఊడిపోయి, భారీ వాహనాల రాకపోకలతో కుంగిపోయి, వరదల కారణంగా వాలిపోయి కొన్ని వంతెనలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఏ ఒక్క వంతెన దెబ్బతిన్నా ఆ దారిలోనే కాదు కదా, ఆ చుట్టుపక్కల ఉన్న ఏ ప్రాంతానికి వెళ్ళాలన్నా మరో మార్గం ఉండదు. ఫలితంగా అటు ప్రజలకి, ఇటు రవాణాకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఈ దుస్థితి మన కళ్ళముందే కనిపిస్తుంటుంది. దెబ్బతిన్న వంతెనల మీద వాహనాలు వెళ్ళాలంటే నరకప్రాయమవుతోంది. వాహనదారులకి చుక్కలు కనిపిస్తున్నాయి. అలాంటి దుస్థితిలో ఉన్న వంతెనలను రాత్రివేళల్లో దాటుకుని వెళ్లాలంటే వాహనదారులు భయంతో వణికిపోతున్నారు. ఇలాంటి దీనావస్థలో వున్న వంతెనల కారణంగా కొన్ని సందర్భాల్లో జనం ప్రాణాలు కూడా కోల్పోతున్నారు.

## రోజు రోజుకీ పెరిగిపోతున్న ట్రాఫిక్..!

వేగంగా మారుతున్న కాలంతో పోటీపడుతూ వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోతోంది. రహదారులపైన ట్రాఫిక్ కూడా అంతే స్థాయిలో పెరుగుతోంది. ఇలాంటి తరుణంలో ఎక్కడైనా ఒక్క వంతెన కూలితే పరిస్థితి ఎంత దయనీయంగా మారుతుందో మనం ఊహించుకోవచ్చు. వంతెన కూలిన ప్రాంతంలో రవాణా పునురుద్ధరించే వరకూ రవాణా వ్యవస్థ మొత్తం స్థంభించిపోతుంది. ఆ సమయంలో ప్రయాణించే జనం గురించి ఆలోచిస్తేనే అయ్యో అనిపిస్తుంది.

## ఇదే మంచి సమయం

రవాణా వ్యవస్థలో రహదారులు ఎంత ముఖ్యమో.. వంతెనలు కూడా అంతే ముఖ్యం. రోడ్లకి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్న మన ప్రభుత్వాలు ఈ పురాతన వంతెనలకు కూడా అంతే ప్రాధాన్యత కల్పించి వాటిని పునర్నిర్మించాలి. ప్రస్తుతం రాష్ట్రాన్ని పాలిస్తున్న కూటమి ప్రభుత్వం, ప్రధానంగా రోడ్లపై దృష్టి పెట్టింది. పూర్తిగా దెబ్బతిన్న రహదారులని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తోంది. పాక్షికంగా దెబ్బతిన్న వాటికి మరమ్మత్తులు చేయిస్తోంది. కానీ, వంతెనల జోలికి మాత్రమే వెళ్ళడం లేదు. కొన్ని వంతెనలు తమ కళ్ళముందే దీనంగా దర్శనమిస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదు. కారణం నిధుల కొరత. ఒక వంతెన బాగుచేయాలన్నా, లేదా శిథిలమైన వంతెన స్థానంలో మరో వంతెన నిర్మాణం చేయాలన్నా మాటలతో పనికాదు. భారీ ప్రణాళికలు కావాలి. బోలెడన్ని నిధులు తేవాలి. అది, ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదు. అందుకోసమే మన నేతలు, అధికారులు దీనస్థితిలోవున్న వంతెనలని చూసినా చూడనట్లే వ్యవహరిస్తున్నారు.

## మంచి తరుణం మించిపోతే మళ్ళీ రాదు..!

అయినా సరే, ప్రత్యేక ప్రాధాన్యతతో వంతెనలు బాగుచేసుకోక తప్పదు. కేవలం రహదారులు బాగుచేసుకున్నందువల్ల ప్రయోజనం ఉండదు. ఒక్క వంతెన కూలితే ఆ రహదారి దేనికీ పనికి రాదు. కాబట్టి, ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి కేంద్రప్రభుత్వ చేయూత చాలా అవసరం. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వంతెనలు, కల్వర్ట్‌ల బాగుకు, వాటి నిర్మాణాలకు అదనంగా కేంద్రం నిధులివ్వాలి. దాంతోపాటు, ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటుచేయాలి. అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన ఇంజనీరింగ్ నిపుణులని కేవలం వంతెనలపై అధ్యయనం కోసం నియమించాలి. కేంద్రం అనుకుంటే ఇది పెద్ద విషయం కాదు. రాష్ట్రపెద్దలు గట్టిగా తలచుకుంటే, కేంద్రం సహకారంతో ఈ బృహత్తర కార్యాన్ని సాధించుకోవడం పెద్ద కష్టం కాదు. అందుకు ఈ కూటమి కాలమే సరైన సమయం కూడా. "మంచి తరుణం మించిపోతే మళ్ళీ రాదు"..!

- రాజశ్రీ

# కూటమికిచ్చిన సూచన బాగుంది!

కూటమి పార్టీలు మూడూ మేము గొప్పంటే మేము గొప్పని చెప్పుకుని సొంత డబ్బా కొట్టుకోవడం నిజంగా హాస్యాస్పదం. జగన్‌మోహన్‌రెడ్డి అరాచకాలకు జడిసి జనం కూటమి పార్టీలని గెలిపించారు. జగన్‌మోహన్‌రెడ్డి స్వయంకృతాపరాధమే ప్రజలు కూటమికి బ్రహ్మరథం పట్టేలా చేసింది. నిజం చెప్పాలంటే కూటమిపై ప్రేమకన్నా జగన్‌రెడ్డిపై ద్వేషమే ఆ మూడు పార్టీలకి కలిసొచ్చింది. ఆ విషయం ఆ కూటమి పార్టీల నాయకులు గ్రహిస్తే మంచిది. ఎవరు ఎంత గింజుకున్నా అంతిమ నిర్ణయం ప్రజలదే అన్న సత్యాన్ని గుర్తుపెట్టుకోవాలి. గొప్పలు చెప్పుకోవడం మాని ప్రజలకిచ్చిన హామీలపైనా, ప్రజా సంక్షేమంపైనా, రాష్ట్ర పురోగతి పైనా కూటమి పెద్దలు దృష్టిపెట్టాలి. గత వారం మన 'లాయర్'లో 'మూడుముక్కలాట' పేరుతో పతాక శీర్షికన ప్రచురించిన విమర్శనాత్మక వ్యాసంలో కూటమి నేతలకి చేసిన సూచన బాగుంది.

కే. నరసింహులునాయుడు - రామమూర్తినగర్, నెల్లూరు.

# నెల్లూరు నగరంలో పోస్టర్లు నియంత్రించాలి!

కూటమి ప్రభుత్వం ఏర్పడి పొంగూరు నారాయణ సారు మునిసిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నెల్లూరు నగరానికి కొత్త కళొచ్చింది. ఆయన చొరవతో మూతబడిన పార్కులు తెరుచుకుంటున్నాయి. ముఖ్యంగా అన్నమయ్య కూడలిలోని ఎన్టీఆర్ పార్కు జనంతో కళకళలాడుతోంది. నగరంలోని రైల్వే అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్ వంతెనలు కళాత్మక చిత్రాలతో చూడముచ్చటగా ఉన్నాయి. రోడ్డు మీడియంలు, నాలుగు రోడ్ల కూడళ్ళలో వున్న ఐలాండ్‌లు కూడా రంగుల హరివిల్లుతో అందంగా తయారయ్యాయి. అయితే, నగరంలో వాల్‌పోస్టర్ల బెడద మాత్రం తప్పడంలేదు. ఎగ్జిబిషన్లు, పార్టీల కార్యక్రమాలు, మతపరమైన సమావేశాల పోస్టర్లు ఎక్కడపడితే అక్కడ ఇష్టమొచ్చినట్లు అతికిస్తున్నారు. ఆ పోస్టర్లు అతికించే కుర్రాళ్ళు మహా అంటే ఓ అయిదారు మందే ఉంటారు. పోలీసువారి ద్వారా వాళ్లందరినీ పిలిపించి ఓసారి గట్టిగా హెచ్చరిస్తే తప్ప, వారి తీరు మార్చుకోరు. నారాయణ సారు ఈ విషయంపై దృష్టిపెట్టమని మునిసిపల్ కమిషనర్‌కి, పోలీసు వారికీ ఆదేశాలు ఇవ్వాలి. అప్పుడే పోస్టర్ల పీడ విరగడై నెల్లూరు నగరం పూర్తిగా సుందర నగరమవుతుంది.

– వీ. సుధాకర్ - ట్రంకురోడ్డు, నెల్లూరు.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# తుగ్లక్‌ని మరపిస్తున్న ట్రంప్ పాలన

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల విషయంలో వ్యవహరిస్తున్న తీరు నియంతృత్వ పోకడని తలపిస్తోంది. బడా వ్యాపారవేత్త రాజ్యాధినేత అయితే ఎలా ఉంటుందన్న పరిస్థితికి అద్దం పడుతోంది. ఇతర దేశాలని శాసించి తన చెప్పు చేతల్లో పెట్టుకోవాలనే ట్రంపు తలంపు అమెరికా దేశ ప్రజల జీవన వ్యవస్థని అస్తవ్యస్థం చేస్తోంది. అన్ని వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. బ్లాక్ మార్కెట్లు రాజ్యమేలుతున్నాయి. నిత్యావసరాల ధరలు సైతం ఆకాశాన్ని తాకాయి. సామాన్య పౌరులపై సైతం అపార భారం పడుతోంది. నియంతలా వ్యవహరిస్తున్న తుగ్లక్‌ని తెచ్చి తలపై పెట్టుకున్నామన్న మాట సర్వత్రా వినిపిస్తోంది.

– పద్మారెడ్డి గోళ్లమూడి
ఆస్టిన్, టెక్సాస్.

# ఇళ్ళ డబ్బును దిగమింగినవారిపై కఠినచర్యలు

## • గృహనిర్మాణ మంత్రి పార్థసారథి



గత ప్రభుత్వంలో అమాయక గిరిజనులను మోసం చేసి, ఇళ్లు నిర్మించకుండానే ఆ డబ్బునంతా దిగమింగిన కాంట్రాక్టర్లపై కఠినచర్యలు తప్పవని, ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు కూడా సిద్ధమని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఇటీవల ఆయన సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి తోటపల్లిగూడూరు మండలంలోని వరిగొండ, పొదలకూరు మండలంలోని చిట్టేపల్లి తిప్ప గ్రామాల్లోని పేదల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆ తర్వాత నెల్లూరులోని జడ్పీ సమావేశమందిరంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశమయ్యారు. గతంలో శాఖపరంగా సరైన పర్యవేక్షణ లేనందున అవకతవకలు జరిగాయని, అందుకు బాధ్యులైన వారిపై కూడా శాఖపర చర్యలుంటాయని, అయితే తప్పు చేయని, నిజాయితీగల ఉద్యోగులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేనప్పటికీ పేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు మొత్తాలను కేటాయించామని, ఎస్సీ, బీసీలకు 50 వేలు, ఎస్టీలకు 75 వేలు, ఆదివాసి గిరిజనులకు లక్ష రూపాయల వంతున మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అధిక ధరలను దృష్టిలో ఉంచుకొని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ గృహ నిర్మాణ యూనిట్ విలువను రూ. 1.8 లక్షల నుండి రూ. 2.5 లక్షల వరకు పెంచామన్నారు. గృహనిర్మాణ శాఖకు నిధుల కొరత లేదని, ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను 2026 మార్చి ఆఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, పీఎంఏవై-2లో నిర్దేశించుకున్న ఇళ్ళ నిర్మాణాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రీ డిజైన్ చేసి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జల్‌జీవన్ మిషన్లో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలను అనుసంధానం చేసి మంచినీటి సదుపాయాలు కల్పించాలని మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు.

### గత ప్రభుత్వంలో అంతా అభాసుపాలు - దుయ్యబట్టిన మంత్రి ఆనం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ కార్యక్రమం పూర్తిగా అభాసుపాలైందని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన విధంగానే, మూడు ఆప్షన్లతో హౌసింగ్ కార్యక్రమాన్ని నాశనం చేశారన్నారు. అనుభవం లేని కాంట్రాక్టర్లకు నిర్మాణ కార్యక్రమాలు అప్పగించడంతో అవకతవకలు జరిగాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆయా శాసనసభ్యులతో మాట్లాడి, అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను ఏమేరకు పూర్తిచేయవచ్చో పరిశీలన చేయాలన్నారు. శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, అమాయక గిరిజనులను మోసం చేసిన అవినీతి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు 70 శాతానికి పైగా పునాదులు పనికిరాని స్థితిలో ఉన్నాయన్నారు. వాటిని ప్రత్యేక ఇంజనీర్ల బృందంతో పరిశీలన చేయించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు కూడా పాల్గొని, ఇళ్ళ నిర్మాణాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే బావుంటుందో సూచించారు.

## అక్షరదీపాలు వెలిగించే..

# సినారా అక్షరోత్సవం!

### • 13న ద్వితీయ వార్షికోత్సవ సంబరం



నెల్లూరులోని ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు(సినారా) సాహితీ ఫౌండేషన్ అధ్యక్షులు చిన్ని నారాయణరావు, ఆయన తనయుడు చిన్ని శ్రావణ్‌కుమార్ సారధ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది కవులను కవయిత్రులను ప్రోత్సహిస్తూ, సాహితీ లోకంలో అక్షరదీపాలు వెలిగిస్తున్న సినారా ఫౌండేషన్ ద్వితీయ అక్షరోత్సవం ఈనెల 13వ తేదీ ఆదివారం అత్యంత వైభవంగా జరుగనుంది. ఆరోజు సాయంత్ర 5 గంటలకు నెల్లూరు పురమందిరంలోని ఏసీ హాల్‌లో అద్వితీయంగా జరిగే ఈ కార్యక్రమంలో లబ్ధప్రతిష్టులైన పలువురు కవులకు అవార్డులు, కవితా గానాలతో పాటు, స్థానిక కవులకు సన్మానాలు, సాహితీ సత్కారాలు ఉంటాయి. ఈ సందర్భంగా ఏర్పాటయ్యే సభకు 'లాయర్' వార్తాపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ షేక్ అబ్దుల్‌అజీజ్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మాడభూసి సంపత్‌కుమార్, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు, ప్రముఖ రచయిత డా.జీవీ పూర్ణచందు (విజయవాడ), నవ మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ, పెన్నా రచయితల సంఘం (పెరసం) అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, ప్రముఖ కవులు శ్రీరామకవచం సాగర్ (ఒంగోలు), డా.బీరం సుందరరావు తదితర ప్రముఖులు సభను అలరించనున్నారు.

### డా. బండారుకు సినారా ఫౌండేషన్ అవార్డు..

ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త, కవి డా.బండారు ప్రసాదమూర్తికి చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ప్రధాన అవార్డును ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా, ప్రముఖ కవి-రచయిత కీ.శే సత్యవేటి శ్రీకాంత్ స్మారక పురస్కారాన్ని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి పి.శ్రీనివాస్ గౌడ్‌కు అందజేయనున్నారు. పత్రికారంగంలో ఆణిముత్యం..అక్షర యోధుడు..'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాల్‌రెడ్డి స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి, హైదరాబాద్‌కు చెందిన కొమ్మవరపు విల్సన్‌రావుకు బహుకరించనున్నారు. యువకవులకు దారిదీపం.. ప్రసిద్ధ కవి కీ.శే నాగభైరవ కోటేశ్వరరావు స్మారక పురస్కారాన్ని కాకినాడకి చెందిన ప్రముఖ రచయిత-విమర్శకులు అవధానుల మణిబాబు అందుకోనున్నారు.

### పలువురికి విశిష్ట సన్మానాలు.. సాహితీ సత్కారాలు..

ప్రముఖ కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, ఇంద్రగంటి మధుసూదనరావు, కుని అంకబాబు, పేరిశెట్ల శివకుమార్, ప్రముఖ కవయిత్రి తోట సులోచనలకు సాహితీ సత్కారాలుంటాయని, ఈ సాహితీ ఉత్సవానికి సాహిత్యాభిమానుల, కళాభిమానులు అందరూ తరలివచ్చి జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## బాబు జగ్జీవన్‌రామ్‌కి..

# అరుణమ్మ నివాళి



భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఈనెల 5న నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దళితులు, బడుగువర్గాల ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ఆయన చేసిన సంస్కరణోద్యమాలు చరిత్రాత్మకమైనవన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటి సీఇఓ మోహన్‌రావు, జడ్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## బకింగ్‌హామ్ కాలువపై..

# వంతెన ఏర్పాటుకు కృషిచేస్తున్నాం!

### -- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి --



మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళేందుకు, తీరం చెంతనే ఉన్న బకింగ్‌హామ్ కాలువ (ఉప్పు కాలువ) దాటాలంటే కష్టంగా ఉంటోందని, అందువల్ల ఆ కాలువపై వంతెన ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తున్నామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. శ్రీరామనవమి సందర్భంగా ఆయన ఇటీవల కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలం చాకిచర్ల పెద్దపట్టపుపాళెంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. పెద్దపట్టపుపాలెం గ్రామస్థులు ఎన్నికల్లో తమకు ఎంతో మద్దతు ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రచారానికి తాము వచ్చినప్పుడు, గ్రామస్తులు కొన్ని సమస్యలు తమ దృష్టికి తెచ్చారన్నారు. బకింగ్ హామ్ కెనాల్‌పై బ్రిడ్జి లేకపోవడంతో సముద్రంలో వేటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారని, ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే చెరువు పూడికతీత, కాలువల పనులు చేపట్టాలని కూడా గ్రామస్తులు కోరారని, ఆ సమస్యలు కూడా తీర్చేందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ప్రయత్నిస్తున్నామన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, నియోజకవర్గంలో ఇంకా ఎవరికైనా ట్రై సైకిళ్లు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో, ఎంపీ వేమిరెడ్డి సహకారంతో పెద్దపట్టపుపాలెం గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. 30 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. తొలుత, గ్రామస్తుల ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించి, ఎంపీ వేమిరెడ్డిని..ఎమ్మెల్యే ఇంటూరిని ప్రజలు స్వాగతించారు.

# ప్రతి నిరుపేదకు.. మంచి ఇల్లు కట్టివ్వాలి!

### అధికారులతో ఎమ్మెల్యే కాకర్ల



ఇల్లు లేని ప్రతి నిరుపేదకు మంచి ఇల్లు కట్టించి ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ కోరారు. ఇటీవల వింజమూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇళ్ల కేటాయింపుల్లో ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ మైనార్టీ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా చెల్లింపులు జరగాలన్నారు. లోపాలుంటే వెంటనే సవరించి ప్రతి అర్హునికి లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, గృహనిర్మాణశాఖ అధికారి సయ్యద్ పిరాన్ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా బలంగానే ఉంది!

### • కార్యకర్తలకు రామ్‌కుమార్ భరోసా



వైకాపా బలంగానే ఉందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రజలు వైకాపాను ఇప్పుడు బాగా అర్థం చేసుకుంటున్నారని వైకాపా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు భరోసా ఇచ్చారు. ఇటీవల ఆయన వాకాడులోని తమ నివాసంలో తనను కలసిన కోట-వాకాడు, చిట్టమూరు, సైదాపురం మండలాల నాయకులు కార్యకర్తలతో మాట్లాడుతూ, రాష్ట్రంలో రోజురోజుకి టీడీపీకి ఆదరణ తగ్గుతోందని, వైకాపా పట్ల పెరుగుతోందని చెప్పారు. ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వాకాడు ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, నాయకులు వాకాటి జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## బాబు జగ్జీవన్‌రామ్ సేవలు అపూర్వం



భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ నిరుపేద, బడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం చేసిన సేవలు అపూర్వమని, ఆయనో గొప్ప సంఘసంస్కర్త అని నాయకులు కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు, వేదాయపాళెం కూడలిలోని ఆయన విగ్రహానికి నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలతో పాటు జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఆ మహనీయుని ఆశయాల బాటలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటి డైరెక్టర్ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## భక్తజన సంద్రంగా..శబరి శ్రీరామక్షేత్రం



శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 6న నెల్లూరులోని శబరి శ్రీరామ క్షేత్రంలో వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనం తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, శ్రీరామస్తూపం పరిసర ప్రాంతాలన్నీ భక్తజనంతో క్రిక్కిరిసి పోయాయి. శ్రీరామ నామం మార్మోగింది. ఆలయ నిర్వాహకులు, అర్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, రఘునాథరాజు, వెంకురెడ్డి, చంద్రారెడ్డి, దయాకర్‌గౌడ్, దద్దోలు రమణయ్య, రామ్‌నగర్ మిత్రమండలి సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

## ఇ-వ్యర్థాలను తొలగించకుంటే అనర్థాలే!

ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఇ-వ్యర్థాలు)ను ఎప్పటికప్పుడు తొలగించకుంటే అవి కాలుష్యానికి, పర్యావరణ హానికీ దారి తీస్తాయని, మన ఆరోగ్యానికి కూడా అవి సమస్యలు తెస్తాయని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర్ చెప్పారు. ఇటీవల ఆయన కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ వెంకటరమణతో కలసి సమావేశం నిర్వహించారు. పాడైపోయిన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టెలివిజన్లు, రకరకాల ఎలక్ట్రానిక్ వస్తువులు రీసైక్లింగ్ కేంద్రాలకు తరలించాలని ఆయన అధికారులకు సూచించారు.




## సాయినాథుని సేవలో.. వేమిరెడ్డి దంపతులు



నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్ పార్క్ పక్కనున్న సాయిబాబా దేవాలయం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన స్వామివారి రథోత్సవంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం సాయినాథుని దర్శించుకున్న వేమిరెడ్డి దంపతులు.. బాబా రథోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన గంధపు కలశాలను తీసుకొని ఆలయ ప్రాంగణంలో ప్రదక్షణలు చేశారు. అనంతరం, బాబా వారి సన్నిధిలో జరిగిన హారతి కార్యక్రమంలో పాల్గొని, సాయినాథుని రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, తెలుగుదేశం నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జనసేన నాయకులు గుడి హరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సీతారాముల పుష్పయాగంలో :

శ్రీరామనవమి సందర్భంగా నెల్లూరు నగరంలోని లక్ష్మీపురంలో నెల్లూరుజిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారామ స్వామివారి పుష్పయాగంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని, శ్రీ సీతారాములును దర్శించుకున్నారు.

## జయభారత్ ఆసుపత్రికి..2 లక్షల విరాళం



నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో 'నేత్ర రక్ష సేవా పథకం' కింద బెజవాడ రామచంద్రారెడ్డి కంటి విభాగం ద్వారా పేదలకు అందిస్తున్న ఉచిత కంటి ఆపరేషన్లకు ప్రోత్సాహంగా బెజవాడ రామచంద్రారెడ్డి మనుమడు..సునీల్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత బెజవాడ సునీల్ చంద్రారెడ్డి, ఆయన సతీమణి ఉమ ఇటీవల 2 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. సింహపురి వైద్య సేవాసమితి ఛైర్మన్ సీతారామిరెడ్డి ద్వారా ఆ చెక్‌ను ఆసుపత్రి కోశాధికారి గుర్రం సుధాకర్‌కు అందచేశారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ, వీరిచ్చిన విరాళంతో 100మంది పేదవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందంటూ, ఆ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో కూడా వీరి తండ్రి బెజవాడ శ్రీకృష్ణారెడ్డి ఈ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల నిర్వహణకు, వైద్య పరికరాలకు విరాళం అందచేశారని ఆయన గుర్తుచేశారు. జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాల్వేషన్ ఆర్మీ సమావేశం

నెల్లూరులోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో సాల్వేషన్ ఆర్మీ టెరిటోరియల్ యూత్ కాంగ్రెస్ సమావేశం ఇటీవల జరిగింది. సాల్వేషన్ ఆర్మీ ఇంటర్నేషనల్ కమిషనర్ ఎడ్వర్డ్ హిల్, షెల్లీ హిల్ ముఖ్య అతిథులుగా



పాల్గొని, సాల్వేషన్ ఆర్మీ విశిష్టతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు సమావేశంలో ప్రసంగించారు. నెల్లూరు జిల్లా సాల్వేషన్ ఆర్మీ ప్రముఖులు రూథర్ శామ్యూల్, విజయ్‌కుమార్, విజయ్‌ప్రసాద్, మేరిగ్రేసి, చంద్రరాజు, తలారి బాలసుధాకర్ తదితరులు పాల్గొని వారికి స్వాగతం పలికారు. రెండు రోజులపాటు ఈ సమావేశం నిర్వహించారు.

## కొత్త ఓటర్లకు అవగాహన కలిగించండి

### డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు



జిల్లాలో 18 ఏళ్ళు దాటిన ప్రతి యువత ఓటు హక్కు కలిగి ఉండే విధంగా వారికి అవగాహన కలిగించాలని, ఆమేరకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయభాస్కర్‌రావు కోరారు. ఈనెల 8న స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఫారం-6లను త్వరితగతిన పూర్తిచేసే విధంగా రాజకీయపార్టీల ప్రతినిధులు కొత్త ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా, చనిపోయిన వారిని ఓటరు జాబితా నుండి తొలగించేందుకు, వారి మరణ ధ్రువీకరణ పత్రాలను పొందేవిధంగా వారి కుటుంబసభ్యులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. టీడీపీ ప్రతినిధి రసూల్, వైకాపా తరఫున కోటేశ్వరరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నుంచి బాలసుధాకర్, బీజేపీ ప్రతినిధి శ్రీనివాస్, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో..శ్రీరామనవమి



శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈనెల 6న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. స్థానిక ఏసీ స్టేడియంలో ఉదయం 6.30 గంటల నుండి ప్రారంభమైన ఈ వేడుకల్లో వాకర్స్ ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ కిలారి శ్రీనివాసులునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత రాఘవాచారి నేతృత్వంలో శ్రీరామునికి పూజలు నిర్వహించి, శ్రీరామనవమి విశిష్టతను వివరించారు. వాకర్స్ అందరికీ నిర్వాహకులు వడపప్పు, పానకం, బెల్లం పొంగలి, పులిహోరా, గుగ్గిళ్లు ప్రసాదంగా అందజేశారు. 203-డిస్ట్రిక్ట్ ఎలెక్ట గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు విసనకర్రలు పంపిణీ చేశారు. అనంతరం, రాఘవాచారిని సన్మానించారు. అసోసియేషన్ సెక్రటరీ జి.నారాయణరెడ్డి, ట్రెజరర్ మాగంటి ప్రసాద్, పలగాటి శ్రీనివాసులురెడ్డి, ఎస్‌కె నజీర్‌అహ్మద్, బెల్లం చెంచయ్య, కాగొల్లు శివయ్య, యు.అమరలింగం, కల్పం రమేష్ , కె వెంకటరమణ,ఎస్‌కే మస్తాన్‌బాషా, కొండూరు సుబ్బారావు, కె రఘురాం ముదిరాజ, ఏకొల్లు రాఘవరెడ్డి, టి.నారాయణరావు, దొడ్ల జయరామ నాయుడు, బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, యు.గోవర్ధన్, మహేంద్ర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం..షిరిడీసాయి రథోత్సవం



ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా, నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో శ్రీ షిరిడీ సాయినాథుని దివ్య రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. మందిరం నిర్వాహకులు మధుసాయి పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవంలో వందలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ సాయి అఖండనామ సంకీర్తనలు, విష్ణుసహస్రనామం సామూహిక పారాయణాలతో, స్వామివారికి వెండిపల్లకి ఉత్సవం, గంధమహోత్సవాలతో మందిరం శోభాయమానమైంది. భక్తులందరికీ మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. అనంతరం, 7వ తేదీన శ్రీ సాయి సచ్చరిత్రం పూర్తి గ్రంథాన్ని అఖండ పారాయణం చేశారు. సాయిదర్బార్ అద్దాలమందిరంలో చేస్తున్న స్వామివారే సేవే కాక, సామాజిక సేవలో భాగంగా ఈనెల 13న రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని, పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు మందిరంలో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని మధుసాయి ఈ సందర్భంగా విజ్ఞప్తిచేశారు.



# ప్రగతి ఛారిటీస్‌కి విపిఆర్ విరాళం

**• రూ.3 లక్షలు అందజేసిన వేమిరెడ్డి దంపతులు**

సేవకు మారుపేరుగా, దీనజనులకు ఆపద్బాంధవునిగా, మహాదాతలుగా పేరెన్నికగన్న వేమిరెడ్డి దంపతులు ఇటీవల తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మానసిక వైకల్యం కలిగిన పిల్లలను అక్కున చేర్చుకుని, వారికి విద్య నేర్పి, తమవంతు సేవలందిస్తున్న నెల్లూరులోని ప్రగతి ఛారిటీస్ సంస్థకు 3లక్షల రూపాయల విరాళం అందించి తమ దాతృత్వం చాటుకున్నారు. ఛారిటీస్ ప్రతినిధులు తమ సంస్థలోని చిన్నారులతో కలిసి నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విపిఆర్ నివాసానికి వచ్చి, ఆ దంపతుల నుంచి విరాళం చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా చారిటీస్ చిన్నారులు వేమిరెడ్డి దంపతులకు గులాబీ పువ్వులు అందించి తమ కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఈ ఏడాదే కాదు, దాదాపు గత పదమూడేళ్లుగా వారు తమ వితరణను కొనసాగిస్తూనే ఉన్నారు. 2012వ సంవత్సరం నుంచి ప్రతి ఏటా ప్రగతి ఛారిటీస్ నిర్వహణకు రూ. 3లక్షల రూపాయలను వేమిరెడ్డి దంపతులు అందిస్తుండడం విశేషం. అది వారి సేవాభావానికి, అనాథలు..అసహాయులైన చిన్నారుల పట్ల వారికున్న ప్రేమాభిమానానికి నిదర్శనం. ప్రగతి ఛారిటీస్ సంస్థ ద్వారా నెల్లూరులో మూగ, చెవుడు ఉన్న చిన్నారులకు చదువు చెప్తున్నారు. మానసిక వికలాంగులైన చిన్నారుల బాగోగులు చూస్తున్నారు. అలాంటి చిన్నారులను ఆదుకుంటూ విపిఆర్ దంపతులు భూరి విరాళాన్ని అందజేయడం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ, ఆ దంపతులకు ప్రగతి చారిటీస్ వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రశాంతిరెడ్డి చొరవతోనే..
# బకాయిలు రానున్నాయి

**• షుగర్ ఫ్యాక్టరీ కార్మికసంఘం నాయకుల సంతోషం**



తాము దాదాపు 13 ఏళ్లుగా చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషితో ఫలించిందని, కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, కార్మిక సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల నెల్లూరు, మాగుంట లే-అవుట్‌లోని విపిఆర్ నివాసంలో వారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్మికసంఘ నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ, కోవూరు షుగర్‌ఫ్యాక్టరీ కార్మికులకు చెల్లించాల్సిన దాదాపు 28 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించేలా ప్రభుత్వాన్ని ఒప్పించడంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కీలకపాత్ర పోషించారన్నారు. ప్రశాంతమ్మ అసెంబ్లీలో ప్రస్తావించిన కారణంగానే షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించిందన్నారు. తమ పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి, 28 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించేందుకు అంగీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వారు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. బకాయిలు రాక, జీవనం గడవక.. ఏళ్ళ తరబడిగా అంధకారంలో ఉన్న తమ జీవితాలకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ వెలుగుబాటలు పరిచారని, వారికి తమ కార్మిక కుటుంబాలు రుణపడి ఉంటాయని చెప్పారు.

### కోవూరును ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేద్దాం - ప్రశాంతమ్మ

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, బకాయిలు ఇచ్చేందుకు సమ్మతించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కార్మికుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. తాము కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ సాకారం అవుతుండటంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రియల్టర్లకు కట్టబెట్టాలని చూసిన షుగర్ ఫ్యాక్టరీకి చెందిన 124 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించి ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తామన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు నారాయణ, ఎంవి రమణ, శివ, మస్తాన్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆర్థిక స్వావలంబన రావాలి

## -- మంత్రి ఆనం ఆకాంక్ష --



మహిళలకు ఆర్థిక స్వావలంబన రావాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. అందుకోసం రాష్ట్రప్రభుత్వం వారికి అనేక రకాల స్వయం ఉపాధి కార్యక్రమాలు కూడా చేపడుతోందని చెప్పారు. ఆత్మకూరు పురపాలక సంఘంలో ఆయన ఇటీవల మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కుట్టు శిక్షణ కోసం పురపాలక సంఘానికి ఆన్‌లైన్‌లో 247 దరఖాస్తులు అందాయని, వారిలో 95 మందిని ఎంపిక చేశారని, మరో152 మందికి కూడా త్వరలో కుట్టు శిక్షణ ఏర్పాటు చేస్తామని, మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చిన తర్వాత, వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 1297 మందికి శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు ఇస్తామన్నారు. జిల్లాలో మొత్తం 47 కుట్టు శిక్షణా కేంద్రాలలో 4967 మందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో శిక్షణ, కుట్టుమిషన్ల కోసం 10 కోట్ల 82 లక్షల 70 వేల రూపాయలను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. రాబోయే రెండు మూడు నెలల్లోనే ఆత్మకూరులో 56 కోట్ల రూపాయల వ్యయంతో త్రాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్తు తదితర సదుపాయాలు కలిగిస్తామన్నారు. ఆత్మకూరు బైపాస్ రోడ్డుకు 6.5 కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు. అదేవిధంగా, ఆత్మకూరు జిల్లా వైద్యశాలను 300 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామన్నారు.

# మోడల్ హైస్కూల్‌గా..విఆర్‌సి

## విద్యార్థుల కోసం విద్యుత్ బస్సు - మంత్రి నారాయణ వెల్లడి



రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఒక మంచి మోడల్‌గా ఉండేలా నెల్లూరు విఆర్ హైస్కూల్‌ను తీర్చిదిద్దుతున్నామని, త్వరలోనే ఇక్కడ విద్యార్థులకు అడ్మిషను జరిగేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ తదితర అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మూతబడిపోయిన విఆర్ హైస్కూల్ పునరుద్ధరణ లక్ష్యాన్ని నెరవేర్చి, తద్వారా పేదపిల్లల బంగారుభవితకు బాటలు వేద్దామన్నారు. పేద విద్యార్థుల కోసం ఒక విద్యుత్‌బస్సును కూడా ఏర్పాటుచేస్తామని ఆయన చెప్పారు. నగరంలోని 46 పార్కుల్లో వారం రోజుల్లో జరిగిన పనుల వీడియో క్లిప్స్‌ను ఈ సందర్భంగా మంత్రి పరిశీలించారు. పనులు చేసినవారి బిల్లులు వెంటనే చెల్లించాలని కమిషనర్‌ను ఆదేశించారు. పెద్ద పార్కుల్లో కమ్యూనిటీ హాల్స్ కూడా నిర్మించాలని చెప్పారు.

### కుక్కల బెడద తగ్గిస్తాం :

రాష్ట్ర వ్యాప్తంగా కుక్కల బెడదను తగ్గించడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని, కుక్కల వాక్సినేషన్‌కు 200 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో సుమారు 2 లక్షల కుక్కలున్నట్లు గుర్తించామని, రోజుకి వెయ్యి కుక్కలకి స్టెరిలైజేషన్ చేయాలని ఆదేశాలిచ్చామని ఆయన చెప్పారు. అనంతరం పార్టీ నాయకులతో మాట్లాడుతూ, ప్రభుత్వ భూముల జోలికి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థలో ఎవరు అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టిడిపి నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్ మావిడాల మధు, పలువురు కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు

## బీద రవిచంద్రకు
# మంత్రుల సన్మానం



రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్రయాదవ్‌ను రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్‌లు ఘనంగా సన్మానించారు. పార్టీ ఎన్ని కష్టనష్టాల్లో ఉన్నా రవిచంద్ర ఏనాడూ పార్టీని కానీ, జెండాను కానీ మార్చలేదని, నిబద్ధతగల నాయకునిగా, అందరికీ మార్గదర్శకునిగా ఉంటూ తెలుగుదేశం పార్టీలో మంచిపేరు సంపాదించుకున్నారని మంత్రులు ఈ సందర్భంగా అభినందించారు.

కావలి సెల్ఫీపాయింట్ కూడలిలో ఈ నెల 8వ తేదీ రాత్రి పెద్దఎత్తున బీద రవిచంద్రకు పౌర సన్మానం జరిగింది. మంత్రులతో పాటు స్థానిక టీడీపీ నాయకులు, భారీసంఖ్యలో కార్యకర్తలు ఈ కార్యక్రమానికి తరలివచ్చి రవిచంద్ర పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో రవిచంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులు, ఆదరణతోనే తనకీ గౌరవం దక్కిందని వినమ్రంగా చెప్పారు.






## జానకిరామ.. రామాయణం 60

- ఊటుకూరు జానకి రామారావు



కాబట్టి రావణా, హాయిగా సుఖాన ఉన్న ప్రాణాన్ని దుఃఖాన ఎందుకు పెట్టుకుంటావు, నీవాళ్ళంతా రకరకాల ఉత్సవాలు చేసుకుంటూ రోజూ ఆనందంగా ఉంటున్నారు, వారికి ఆ ఆనందం కలకాలం ఉండేటట్లు చూడు. నిష్కారణంగా రాముడికి అపకారం చేసి, ఆయన కోపానికి గురి అయ్యి మొత్తం రాక్షస జాతినే ఎందుకు పాడు చేసుకుంటావు అని పలికాడు మారీచుడు.

మరణించబోయేవాడికి ఇచ్చిన ఔషధాలవలె, చవట నేలలో వేసిన విత్తనాలవలె మారీచుడి హితోక్తులు నిష్ఫలమైపోయాయి.

రావణుడు రాముడి పట్ల అభిప్రాయమేమీ మార్చుకోలేదు, పైగా అతడు మానవమాత్రుడు, నన్నేమీ చేయజాలడు అన్నట్లుగా పరుషంగా మాట్లాడాడు.

ఖరుడి హత్యకు ప్రతీకారంగా అతడి భార్యను ఎత్తుకొని రావలసిందే అని పట్టుబట్టాడు.

నేను చేయాలనుకున్న పని యొక్క గుణదోష విచారం చెయ్యి అని నిన్ను అడుగలేదు.

నీకు రాజుతో మాటలాడే పద్ధతి తెలియకుంది, దోసిలి ఒగ్గి అతనికి ప్రతికూలంకాని హితకరములైన విషయాలను వినయంగా, మృదువుగా చెప్పవలె!

ఎంత హితకరములైనా గౌరవం లేకుండా తిరస్కార బుద్ధితో చెప్పినచో రాజు హర్షించడు.

రాజు అనగా అయిదుగురు దేవతల తేజోంశలు కలగలసినవాడు.

అగ్ని, ఇంద్ర, వరుణ, యమ, చంద్ర అంశలవి.

నీవు ఆ జ్ఞానం కోల్పోయి నీ ఇంటికి సహాయం నిమిత్తం స్వయంగా వచ్చిన నన్ను అవమానిస్తున్నావు.

ఇది మంచిదా, లేక చెడ్డదా నాకు ఈ పని చేయగల సామర్థ్యం ఉందా లేదా అని నేను నిన్ను అడుగలేదు.

నేను తలపెట్టిన ఈ మహాకార్యానికి నీ సహాయం అత్యంత ఆవశ్యకం కావున నీవు చేసి తీరవలె!

ఇది నా ఆజ్ఞ!

నీవు చిత్రవిచిత్ర వర్ణాలుగల బంగారులేడి రూపం ధరించు, ఆ లేడి వంటి మీద వెండి చుక్కలు మెరుస్తూ ఉండాలి సుమా!

వారి ఆశ్రమ పరిసర ప్రాంతాలలో తిరుగుతూ సీత దృష్టిని ఆకర్షించు, నిన్ను చూసి ఆవిడకు ఆశ్చర్యం కలుగవలె!

నిన్ను పట్టితెమ్మని ఆవిడ రాముని పంపుతుంది, నీవు అతనిని ఆశ్రమానికి బహుదూరంగా తీసుకొని పోయి "అయ్యో లక్ష్మణా, అయ్యో సీతా" అని అరుపులు కూడా అరువు.

అది విని సీత, లక్ష్మణుని రాముని కొరకు పంపగలదు. వారిరువురూ ఆవిధంగా దూరంగా వెళ్ళిన పిదప అనాయాసంగా ఆమెను నేను ఎత్తుకొని రాగలను.

మారీచుడా నీవు ఈ పని చేసినట్లైన ఎడల నా రాజ్యంలో సగ భాగం నీకిచ్చెదను.

ఆలస్యం చేయక బయలుదేరు, నీ వెనుక రథంపై కూర్చుండి నేను అనుసరిస్తాను.

ఈ విధంగా రాముని వంచించి యుద్ధం చేయకుండగనే సీతను పొంది కృతకృత్యుడనై లంకకు తిరిగి వెళ్ళెదను.

నా ఆజ్ఞకు విరుద్ధంగా నీవు చేసినట్లైనచో ఇప్పుడే నిన్ను చంపివేస్తాను, రాజుకు ప్రతికూలంగా ఉండేవాడు సుఖంగా అభివృద్ధి చెందజాలడు.

నీచే బలాత్కారంగానైనా ఈ పని చేయిస్తాను. నీ ఇష్టాయిష్టాలతో నాకు పని లేదు.

నీవు రాముని వద్దకు వెళ్ళినచో మరణించవచ్చును, లేక మరణించకపోవచ్చును. కానీ, నాతో విరోధం పెట్టుకుంటే తక్షణమే మరణిస్తావు. కావున నీకేది మంచిదో ఆలోచించి నిర్ణయించుకో!

అని బెదిరించాడు రావణుడు!

రావణుడి ఆజ్ఞ విని మారీచుడు అంతే పరుషంగా బదులిచ్చాడు. నీవు, నీ పుత్రులు, నీ అమాత్యులు, నీ రాష్ట్రం సకలం నాశనమయ్యేటట్లు ఏ పాపాత్ముడిచ్చాడు నీకీ సలహా !

కోరికోరి మృత్యుద్వార ప్రవేశం చేయాలనుకుంటున్నావు.

నీకు సరి అయిన సలహా ఇచ్చే మంత్రులే కరవైనారే!

రావణా ఇంత తీక్ష్ణ స్వభావంగల నీ పాలనలో ప్రజలంతా కూడా నక్కచేత కాపలా కాయబడే గొర్రెల వంటి వారు! వారికింకా వృద్ధి ఎక్కడ?

నేను ఎలాగూ రామునిచేతిలో చంపబడతాను, ఆ తరువాత కొంతకాలానికే నీ వంతుకూడా వస్తుంది, నేను ఆయన చేతిలో చనిపోవడానికే నిశ్చయించుకున్నాను.

రాముడి చూపు నా మీద పడనంతవరకే నా ప్రాణాలు ఈ శరీరంలో ఉంటాయి, ఒక్కసారి ఆయన నన్ను చూశాడా ఇక ఆ క్షణమే నా జీవితపు చివరి క్షణం.

అని పలుకుతూ దీనంగా ఇక వెళదాం పద.. అంటూ రావణుడితో బయలుదేరాడు మారీచుడు.

అప్పుడు రావణుడు ఆనందంగా మారీచుని కౌగలించుకొని తన రథం మీద కూర్చుండ బెట్టుకొని రామాశ్రమ సమీపంలోకి చేరాడు.

విమానం వలెనున్న ఆ రథం దిగి పరిసరాలను గమనిస్తూ ఆశ్రమం వైపు దృష్టి సారించాడు.

మారీచా! అదుగో ఆ అరటి చెట్లు పెరిగివుండే ఆ ప్రదేశం! అదే శ్రీరాముని ఆశ్రమం, నీవు త్వరగా పనిపూర్తిచేయాలి సుమా అని హెచ్చరించి పంపాడు.

మారీచుడు ఒక అందమైన లేడి రూపం ధరించాడు.

ఆ మృగానికి అందమైన కొమ్ములున్నాయి, ఆ కొమ్ముల చివరలు మణికాంతులతో మెరిసిపోతున్నాయి.

దాని ముఖం కొంత తెలుపు, కొంత నలుపు, ఒక చోట ఎఱ్ఱని పద్మమువలె మరియొక చోట నల్లకలువలాగా ఉంది.

దాని చెవులు ఇంద్రనీలాల మణులా అన్నట్లుగా భాసిస్తున్నాయి.

మెడ కొంచెం ఎత్తుగా ఉండి క్రింది దవడ ఇంద్రనీల మణి లాగా మెరుస్తూ ఉంది.

దాని పొట్ట మల్లెపూవులాగా, చంద్రుడులాగా, వజ్రం లాగా ప్రకాశిస్తూ ఉంది.

దాని శరీరం కొంత భాగం ఇప్పపూవు రంగులో, కొంత భాగం పద్మ కేసరవర్ణంతో మెరిసిపోతూ ఉంది.

సన్నటి పిక్కలతో తళతళ మెరిసే రంగుతో పొందికైన అవయవాలతో చూడగానే సొంతం చేసుకోవాలన్న భావన ఎంతవారికైనా కలిగించేదిగా ఆ మృగం ఉంది.

ఆ మాయా మృగం చెంగుచెంగున గంతులు వేస్తూ సీతారాముల ఆశ్రమ ప్రాంతంలో సంచరిస్తుంది.

అది గంతులు వేసినప్పుడల్లా సూర్యకాంతి దాని శరీరం మీదనుండి ప్రతిఫలించి వింత వింత శోభలతో అలరారుతోంది.

ఎలాగైనా సరే సీతాదేవి కంట్లో పడాలనే తాపత్రయంతో ఆశ్రమ పరిసరాలలోకి వెళుతుంది, మరల బయటకు వస్తుంది, సీతమ్మ వచ్చే అరటిచెట్ల దగ్గరే తిరుగాడుతూ సీతాదేవి దృష్టి పడేటట్లుగా దూకుతోంది, హఠాత్తుగా గంతులు వేసి గుండ్రంగా తిరుగుతోంది, దాని హొయలు, వయ్యారము చెప్పనలవి గాకుండా ఉంది.

తోటి మృగాలు దాని వద్దకు వచ్చి వాసన చూసి గాభరాపడి తప్పుకుంటున్నాయి. మృగాలు దగ్గరకు వచ్చినప్పుడు తినాలని వాటిమీద కోరిక కలిగినప్పటికీ నిగ్రహించుకుంటున్నాడు మారీచుడు.

ఆ సమయంలో పూలుకోసుకోవడానికి సీతాదేవి ఆశ్రమం నుండి బయటకు వచ్చింది, అదే సమయంలో ఆమె కళ్ళముందు ఏదో మెరుపు మెరిసినట్లయి అటువైపు చూసింది, అప్పుడు ముత్యములచేత, మణులచేత సహజసిద్ధంగా అలంకరింపబడి ప్రకాశించే మృగం ఆవిడ కంట పడ్డది.

సీతాదేవిని చూడగానే ఆ మాయామృగం ఇంకా చిత్రవిచిత్ర గతులతో విన్యాసాలు చేసింది, మధురంగా కూసింది, ఆహ్లాదకరంగా ఆడింది, ముద్దులు ఒలకబోస్తూ గిరగిరా తిరిగింది, భూమిమీద పడుకొని వళ్ళు విరుచుకొని శరీర సౌందర్యమంతా సీతాదేవి కళ్ళలో పడేటట్లుగా అటూఇటూ మెదిలింది.

ఆ మృగాన్ని చూడగానే బిగ్గరగా కేక వేసి రామలక్ష్మణులను పిలిచింది సీతమ్మ.

ఆ మృగాన్ని చూడగానే వీడు మారీచుడే అని గుర్తుపట్టాడు లక్ష్మణుడు! అన్నా వీడు నిస్సందేహంగా మారీచుడే! వేటకు వచ్చిన రాజులను భ్రమింప చేసి రకరకాల మృగ రూపాలు ధరించి వారిని సమీపించి వారు మోహంలో పడి దగ్గరకు రాగానే వారిని చంపి భక్షించేవాడు, అది వాడి చరిత్ర.

ఇది వాడి ఐంద్రజాలమే!

రామా ఎక్కడైనా మణిమాణిక్యాలు, రత్నాలు సహజంగా పొదగబడ్డ మృగం సృష్టిలో ఉంటుందా? అని పలుకుతున్న లక్ష్మణుని మాటలకు అడ్డు తగిలి సీతమ్మ ఇలా పలికింది.

..(సశేషం)

# ట్రంప్ తీరుతో.. అగాధంలోకి అమెరికా

మనసులో మాట 40

ట్రంప్ ప్రతీకార సుంకాల యుద్ధానికి అడ్డూఅదుపు లేకుండాపోతోంది. క్రమబద్ధంగా నడుస్తున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ట్రంప్ దుందుడుకు చర్యలతో అస్తవ్యస్తం కావడంతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందన్న ఆందోళన అక్కడి ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎగుమతులు, దిగుమతుల వ్యత్యాసమే ఏ దేశ ఆర్థిక వ్యవస్థనైనా శాసించేది. ఎగుమతుల విలువ ఎక్కువగా ఉండి దిగుమతుల విలువ తక్కువగా ఉన్న దేశం ఆర్థికంగా బలంగా ఉంటుంది. ఈ వ్యత్యాసం చాలా అసమతౌల్యంగా ఉందని, తాము దిగుమతి చేసుకుంటున్న వస్తువులు, సేవలపై తాము విధిస్తున్న సుంకం కన్నా ఇతర దేశాలకు తాము ఎగుమతి చేస్తున్న వస్తువులు, సేవలపై ఆయా దేశాలు విధిస్తున్న సుంకాలు ఎక్కువగా ఉంటున్నాయని, ఫలితంగా తమకు వాణిజ్యపరంగా నష్టం వాటిల్లుతుందన్నది ట్రంప్ వాదన. అందుకే అమెరికాకు దిగుమతయ్యే వస్తు, సేవలపై ఇటీవల దేశాల వారీగా సుంకాలు పెంచుతూ నిర్ణయం వెలువరించారు. అమెరికా చర్యకు ప్రతీకారంగా చైనా సుంకాలు పెంచడంతో ట్రంప్ ఆ దేశంపై 100శాతానికి పైగా సుంకాలు విధించడం ఇప్పుడు పెద్దఎత్తున చర్చనీయాంశం అయింది. ఈ పరిస్థితి ఎక్కడకు దారి తీస్తుందో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మామూలు ఆర్థికయుద్ధం కాదని, ఆర్థికంగా అణుయుద్ధంతో సమానమని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అమెరికా ప్రయోజనాల విషయంలో రాజీపడని నేతగా ట్రంప్ పేరు తెచ్చుకున్నారు. అయితే అందుకు ఆయన అనుసరిస్తున్న విధానాలే పరిపక్వంగా లేవు. పైపెచ్చు ఆయన చర్యలు అమెరికా ప్రయోజనాలకే విఘాతం కలిగించేలా ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధం, రెండో ప్రపంచ యుద్ధం కాలంలో ప్రపంచం రెండు బలమైన కూటములుగా చీలింది. తదనంతర కాలంలో సోవియట్ యూనియన్ చీలిపోయిన తర్వాత అమెరికా అగ్రరాజ్యంగా అవతరించి దాదాపు ఏక ధ్రువ ప్రపంచం అవతరించింది. రష్యా బలంగా ఉన్నప్పటికీ ఆర్థికంగా అమెరికానే పైచేయి సాధిస్తూ వచ్చింది. తర్వాత తర్వాత చైనా ఆర్థికంగా బలోపేతం అవుతూ అమెరికాకు సవాలు విసురుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో తన స్థానాన్ని మరింత సుస్థిర పర్చుకుంటూ ఆర్థికంగా మరింత బలోపేతం అవ్వాల్సిన అవసరం అమెరికాకు ఉంది. కానీ ట్రంప్ చర్యలు అమెరికాను మరింత బలహీనపర్చేలా ఉన్నాయని, అమెరికా ఒక వైపు, ప్రపంచమంతా మరోవైపు చేరేలా ఆయన విధానాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

త్వరలో ఫార్మా దిగుమతులపైనా ప్రతీకార సుంకాలు విధిస్తానని ట్రంప్ ప్రకటించడం దారుణమైన చర్యే. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాలలో 45 శాతం భారత్ నుంచే ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు వాటిపైనా దిగుమతి సుంకాలు పెంచడంవల్ల అక్కడ ఔషధాల ధరలు మరింత పెరుగుతాయి. అమెరికాలో వైద్య ఖర్చులు అధికం. ఓవర్ ది కౌంటర్ ఔషధాలు కొనుక్కోవాలంటే ఆర్థికంగా చాలా భారంగా మారుతుంది. ఔషధ కంపెనీలకు గిట్టుబాటు కాక సరఫరాను తగ్గిస్తే ఔషధాల కొరత ఏర్పడే ప్రమాదం కూడా ఉంది.

భారత్ ఎగుమతులపై ట్రంప్ 26% సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దీనిపై భారత్ ప్రతీకారం తీర్చుకోవాలని భావించడం లేదు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు మెరుగుపర్చుకోవాలనుకుంటోంది. ఇది మంచి వ్యూహమే. మరోవైపు అమెరికా ప్రతీకార సుంకాల దెబ్బకు ప్రభావితమయ్యే దేశాలు తమ తయారీ కేంద్రాలను భారత్‌కు తరలించి ఇక్కడి నుంచి అమెరికాకు ఎగుమతి చేయాలని భావిస్తున్నాయి. ఇది ఉభయ తారకం కూడా. ఆయా దేశాల్లోని కంపెనీలకూ లాభం. భారత్‌కూ ప్రయోజనం. ఈ అవకాశాన్ని భారత్ ఎంత త్వరగా అందిపుచ్చుకుంటే అంత మేలు.

అమెరికాలో తయారీ రంగాన్ని బలోపేతం చేయకుండా ఇలా ప్రతీకార సుంకాలు విధించడం అమెరికాకు ఆత్మహత్యా సదృశ్యమే. అమెరికా సమాజంలో తయారీ వాతావరణం బాగా సన్నగిల్లింది. 1970ల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు తయారీ రంగంలో ఉండగా ఇప్పుడు ప్రతి పది పన్నెండు మందిలో ఒకరే తయారీ రంగంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంటే తయారీ రంగానికి కావాల్సిన వ్యవస్థ అక్కడ లేదు. ఆ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి చాలా దశాబ్దాలు పడుతుంది. అంటే అప్పటి వరకు అమెరికా ప్రజలు దిగుమతులపైనే ఆధార పడక తప్పదు. కానీ ప్రతీకార సుంకాల వల్ల వస్తు సేవల ధరలు బాగా పెరిగి సగటు అమెరికా ప్రజలు వాటిని కొనలేని పరిస్థితుల్లో ఉంటారు. ఇది సమాజంలో తీవ్ర అసంతృప్తికి దారి తీయవచ్చు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో ఇప్పటికే అక్కడి ప్రజల్లో అసంతృప్తి రాజుకుంటోంది. ఇటీవల దేశవ్యాప్తంగా ప్రజలు, వివిధ వర్గాలు నిరసనలు వ్యక్తం చేయడం ఇందుకు నిదర్శనం.

మరోవైపు వలసదారులను కూడా ట్రంప్ ముప్పుతిప్పలు పెడుతున్నారు. చిన్న చిన్న సాకులు చూపి వలసదారులను సొంత దేశాలకు పంపిచే ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాలు అతివేగంతో నడిపారన్న కారణంతోనో, ట్రాఫిక్ నిబంధనలు పాటించలేదన్న కారణంతోనో వీసాలు రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అమెరికా సాంకేతికంగా ఇంత బలోపేతమవ్వడానికి, సుసంపన్నం కావడానికి కారణం వలసలను ప్రోత్సహించడమే. అమెరికాకు మేధో వలసలు లేనిదే అక్కడ సిలికాన్ వ్యాలీ లేదు. ఇప్పుడు వలసదారులపై ట్రంప్ విరుచుకుపడడం ఒక రకంగా భారత్ వంటి దేశాలకు మంచిదే. మనం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మేధో వలసలను తారుమారు చేయగలిగితే ఇక్కడే గొప్ప సాంకేతికత ప్రపంచాన్ని అభివృద్ధి చేయవచ్చు.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఆయన సహకారం మరువలేనిది

● గంగాప్రసాద్ పుట్టినరోజు వేడుకలో ఎమ్మెల్యే సునీల్



పారిశ్రామికవేత్త, టిడిపి నాయకులు కొండేపాటి గంగాప్రసాద్ సహాయ సహకారాలతో నేడు తాను ఎమ్మెల్యే స్థాయిలో ఉన్నానని, గూడూరు డివిజన్‌లో టిడిపి పార్టీ బలోపేతానికి గంగాప్రసాద్ ఎంతో కృషి చేశారని గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల టిడిపి నాయకులు కొండేపాటి గంగాప్రసాద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు అందించారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ గంగా ప్రసాద్ నాలాంటి యువకులను రాజకీయంగా ఎంతో ప్రోత్సహించారని, ఆయన చేసిన సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. భగవంతుని ఆశీస్సులతో ఇలాంటి పుట్టినరోజులు ఆయన మరెన్నో జరుపుకోవాలని ఆశిస్తున్నామన్నారు. పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, శివకుమార్, శ్రీనివాసులురెడ్డి, రవీందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కన్నులపండువగా శ్రీరాముని కళ్యాణం



గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో ఈ నెల 6వ తేదీ శ్రీరామనవమి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. గూడూరు రెండో పట్టణం, తిలక్‌నగర్‌లో వెలసివున్న శ్రీ సీతారామాంజనేయ క్షేత్రంలో, సిరామిక్ కాలేజీ సమీపంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో, తమ్మినపట్నం శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో, గూడూరు ఒకటవ పట్టణంలో ఉన్న రామాలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం, సాయిబాబా గుడిలో అత్యంత వైభవంగా కళ్యాణం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ గావించి, అన్నదానం నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు పాల్గొని కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

### మార్మోగిన జై శ్రీరామ్ నినాదం

శ్రీరామ నవమిని పురస్కరించుకొని గూడూరు రెండో పట్టణం తిలక్‌నగర్ వద్ద ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి పట్టణంలోని కోదండరామాంజనేయస్వామి దేవస్థానం వరకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తూ భక్తిని చాటుకున్నారు. నాయకులు ఎమ్.మురళీరెడ్డి, కోట సునీల్‌కుమార్, బాలకృష్ణనాయుడు, పేటేటి చంద్రనీల్, మల్లికార్జున్, మయూరి శ్యాంయాదవ్, దయాకర్, వెంకటేశ్వర్లు, శ్రీహరి, కడివేటి రామ్మూర్తి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ గాయత్రిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఇటీవల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు పట్టణ ఎస్.ఐ తిరుపతయ్య పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం వల్ల వారిలో స్ఫూర్తి పెరిగి భవిష్యత్తులో చక్కటి పౌరులుగా రాణిస్తారని కొనియాడారు. కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు మస్తాన్‌బీ, ఉమామహేశ్వరి, హరిత, జ్యోతి స్వరూప్, మునిరాజా, నసీరా, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# రామ కావ్య సుధా లహరి.. జానకిరామ 'రామాయణం'


“వేద వేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే/ వేద: ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా” అన్నారు. ఏ కావ్యానికైనా కావ్య కథనుగాని, అందుగల నాయికా, నాయికల పేర్లనుగాని కేంద్రంగా చేసుకొని పేరు పెడుతుంటారు. రామాయణం, సీతా చరితం ఈ విధంగా ఏర్పడ్డవే! తన పేరులోనే రామాయణంలోని ప్రముఖ పాత్రలను రెండింటినీ కలిగి ఉన్న “ఊటుకూరు 'జానకి'-'రామారావు' ” ఇటీవల “రామాయణం” పేరుతో వాల్మీకి రామాయణాన్ని వచనంగా రచించి సరళంగా పాఠకులకు రుచిపెట్టారు. ఖమ్మంలో నివసిస్తున్న విశేషం. చలనచిత్రాలలో వక్రీకరించిన రామాయణాన్ని, జనసామాన్యానికి వక్రీకరణ లేకుండా యధాతథంగా చెప్పాలన్న బాధాతప్త హృదయమే ఈ రామాయణ మహాకావ్యానికి మూల కారణం.

బాలకాండలో దేవతలు రావణ బ్రహ్మ పెట్టే బాధలను భరించలేక విష్ణు మూర్తితో మొరపెట్టుకోవడంతో ప్రారంభమై, యాగం అనంతరం రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల జన్మవృత్తాంతం చెప్పి, విశ్వామిత్రుని వెంట నడిచిన రామ లక్ష్మణులు ఏవిధంగా దివ్య శస్త్రాస్త్రాలను పొందిన విషయం, తాటక సంహారం, మిథిలలో శివ ధనుర్భంగం, పరశురామ గర్వభంగం జరిగే ఘట్టం చెప్పారు. జీవన విలువలున్న రామాయణం జీవన పారాయణం కావాలంటూ ముగించారు.

అయోధ్యకాండ శ్రీరామ పట్టాభిషేక ప్రస్తావనతో ఆరంభమౌతుంది. మంథర చేసిన దుష్ప్రసంగంతో కైకేయి దేవాసుర యుద్ధంలో కోరిన కోర్కెల కారణంగా దశరథుడు మూర్చిల్లుతాడు. రాముని వెంట సీతమ్మ వనవాసానికేగుతుంది. సీతా సమేతుడైన రాముడు, లక్ష్మణులు అరణ్యాలలో ముందుకు సాగడంతో అయోధ్య కాండ ముగుస్తుంది.

శ్రీరాముడు దండకారణ్య ప్రవేశంతో అరణ్యకాండ ప్రారంభమౌతుంది. విరాధుని వధ, ఖరదూషణుల వధ, శూర్పణఖ జరిగిన వృత్తాంతం చెప్పగానే రావణుడు మారీచుణ్ణి వెంట పెట్టుకొని శ్రీరాముని ఆశ్రమం సమీపించి, మాయలేడి రూపంలో వెళ్ళి అక్కడ తిరుగాడమంటాడు. ఆ బంగారు లేడి తేవాలని వెళ్ళిన రాముడి అస్త్రం దెబ్బతిన్న మారీచుని అయ్యో సీతా!...అయ్యో లక్ష్మణా! అన్న అరుపులు విన్న సీతమ్మ, లక్ష్మణుణ్ణి విషయం తెలుసుకొనిరమ్మంది. అంతలో అక్కడికి రావణుడు వచ్చి, సీతమ్మను అపహరించి, ఆమెను అశోక వనంలో వదిలి వెళ్ళిపోతాడు. రామ లక్ష్మణులు సీతమ్మను వెదుక్కుంటూ మలయ పర్వతం చేరడంతో అరణ్యకాండ ముగుస్తుంది.

కిష్కింధకాండలో వాక్య కోవిదుడైన హనుమ, సుగ్రీవుని ఆజ్ఞచే వారిని కలిసి విషయమరసి రామునితో సుగ్రీవునికి మైత్రి చేస్తాడు. సుగ్రీవుడు సీత జారవిడిచిన ఆభరణాలను చూపించి, ముల్లోకాల్లో ఎక్కడున్నా సీతమ్మను నీ దరి చేరుస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. అనంతరం వాలి సంహారం, సుగ్రీవ పట్టాభిషేకం అయ్యాక వానర వీరులు నలుదిక్కులకు వెళ్ళి సీతమ్మ జాడను తెలుసుకునే ప్రయత్నంలో ఉండగా హనుమ దక్షిణ దిక్కున మహేంద్ర పర్వతం పైకి చేరాడు.



రచయిత్రి:
**ఊటుకూరు జానకిరామారావు**
వెల: రూ. 316/- పేజీలు: 480
ప్రతులకు: ఊటుకూరు జానకి రామారావు
ఇం.నం.395, రోడ్ నం.5,
శ్రీ సిటీ నగర్, వరంగల్ రోడ్, ఖమ్మం,
తెలంగాణ. సెల్: 7702660087

సుందరకాండలో ఒక్క ఊపున ఎగిరిన హనుమ లంకలో కాలు పెడతాడు. అశోక వనం చేరిన హనుమకు సీతమ్మ దీనస్థితిలో కనిపించింది. నెమ్మదిగా చెట్టు దిగి సీతమ్మతో మాట్లాడి ఆమెకు రాముని ఉంగరాన్నిచ్చి ఆమెకు ఉపశమనం కలిగిస్తాడు. అశోకవనాన్ని ఛిన్నాభిన్నం చేసి అనేక రాక్షసులను నేలకూల్చగా, ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రానికి కట్టుబడి రావణుని అంతఃపురంలో ప్రవేశిస్తాడు. హనుమ మాటలకు కోపించి తోకకు నిప్పు పెట్టగా లంకా నగరాన్ని సర్వనాశనం చేసి ఆకాశానికెగిరి దిగబోతూనే “చూశాను సీతమ్మను” అంటూ నేలకు దిగాడు.


యుద్ధకాండలో సకల వానర సైన్యమూ సేతువును నిర్మించి, జరిగిన మహాసంగ్రామంలో రావణుడు నేలకూలాడు. శ్రీరామ పట్టాభిషేకంతో రామాయణం పరిసమాప్తి అవుతుంది. ఈవిధంగా మనకు శ్రీమద్రామాయణాన్ని వినిపిస్తారు జానకి రామారావు. మధ్య మధ్యలో అనేక ఆంగ్ల సామెతలు, విశేషాలు చెప్పు, ఇది ఒక వ్యక్తిత్వ వికాస గ్రంథమని నిరూపిస్తాడు. ఒకసారి ఆరంభించిన పాఠకుడు చదవడం పూర్తి చేస్తే కానీ ఈ పుస్తకం క్రింద పెట్టని జానకి రామారావు విలక్షణ శైలి చదువరిని కట్టిపడేస్తుంది.

సమీక్షకులు:
**డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య**
9490400858



'లాయర్' పత్రికలో ధారావాహికంగా వారం వారం ప్రచురితమౌతున్న ఊటుకూరు జానకి రామారావు గారి 'జానకి రామ రామాయణం' ఇటీవలే పుస్తకంగా ముద్రితమైంది. పాఠకులు గమనించగలరని మనవి. - సం/-

# ముత్యాలమ్మకి పల్లకి సేవ



చిల్లకూరు మండలం, తూర్పుకనుపూరులోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 8వ తేదీ ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం మూల మూర్తులకు అభిషేకం నిర్వహించగా, భక్తులు పొంగళ్ళు పెట్టుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మ వారికి పంచహారతులు, పల్లకి సేవ, ఊంజల్ సేవలు నయనానందకరంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్, ధర్మకర్తల మండలి, కార్యనిర్వహణాధికారి నవీన్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

# ఎన్‌బికెఆర్‌లో.. సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో ఇటీవల 'సైబర్ సెక్యూరిటీ ఫండమెంటల్స్ అండ్ ప్రాక్టికల్ అప్లికేషన్స్' అనే అంశంపై వర్క్‌షాప్ ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో సుప్రజా టెక్నాలజీస్ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీస్‌కు సంబంధించిన వివిధ అంశాలను వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ ఐఎస్టీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి. విజయకుమార్ రెడ్డి, సీఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎ.నారాయణరావు, డాక్టర్ ఎస్.సురేష్‌బాబు, ఆర్అండ్‌డీ ఇన్‌చార్జి డాక్టర్ పి.చంద్రకాంత్ మరియు సైబర్ సెక్యూరిటీ క్లబ్ ఇన్‌చార్జి ఎం.శివ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 24న టెక్‌యువ-2కె25..

ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో సిఎస్ఇ, ఐటీ, ఏఐ & డిఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న టెక్‌యువ-2కె25 సాంకేతిక సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఈ నెల 7న కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి, సంబంధిత హెచ్ఓడీలు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అనేక కళాశాలల నుండి విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.

# కలుగులో కాకాణి!

(మొదటిపేజీ తరువాయి)

కోటంరెడ్డి శ్రీధరరెడ్డి ప్రదర్శించిన రాజకీయ చాణుక్యత వల్ల జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజకీయాల్లోకి వచ్చీరాగానే ఆయనని క్యాబినెట్‌హోదా వరించింది. అయితే జిల్లా పరిషత్ అధ్యక్షహోదాలో ఆయన చాలామంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన కంటే ముందు ఛైర్మన్‌లుగా పనిచేసిన వారికంటే చాలా మెరుగనే కీర్తిని గడించాడు. ఆయన హయాంలో జిల్లాస్థాయిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి అబ్బో అనిపించు కున్నాడు. ఆ తరువాత 2009 ఎన్నికల నాటికి ఆయనకి శాసనసభ సభ్యత్వంపై ఆశ పుట్టింది. ఆత్మకూరు నియోజకవర్గం నుండి టిక్కెట్టు ఆశించాడు. అయితే క్యాబినెట్ హోదాలో వున్న వ్యక్తిని అక్కడినుండి కదిలించడం ఇష్టం లేక రాజశేఖరరెడ్డి కాకాణికి టిక్కెట్టు ఇవ్వలేదు. కాకాణి అలిగాడు. టీడీపీలో చేరడానికి ప్రయత్నాలు చేశాడు. కానీ, ఆ ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి జడ్పీ ఛైర్మన్‌గానే కొనసాగాడు. ఆ తరువాత రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో 2011లో కాకాణి జగన్ పంచన చేరాడు. జగన్ గాలిలో 2014లో తొలిసారిగా ప్రజాక్షేత్రం నుండి శాసనసభకి ఎంపికయ్యాడు.

ఆ ఎన్నికలలో ఓటర్లకి కల్తీ మద్యం పంచాడన్న అపవాదుని మూటగట్టుకున్నాడు. నేటికీ ఆ కేసుని ఎదుర్కొంటున్నాడు. ఇక్కడినుండే కాకాణి వ్యవహారశైలి పూర్తిగా మారిందని ఆయన అనుయాయులే చెప్పడం గమనార్హం. జిల్లాపరిషత్ ఛైర్మెన్ గోవర్ధన రెడ్డికీ, ఎంఎల్‌ఏ గోవర్ధనరెడ్డికి సంబంధమే లేదన్నట్లుగా ఆయన మార్పు చెందాడన్నది వారి అభిప్రాయం. తాను సర్వేపల్లి నియోజకవర్గం నుండి ఎంపికైన కొద్దిరోజుల నుండే ఆయన తన ప్రత్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శిం చడం మొదలుపెట్టాడు. మనిషి క్లాస్‌గా కనపడినా... మాటలు మాత్రం ఊర మాస్ అనే భావన వచ్చేలా పత్రికలలో సైతం రాయలేని నికృష్టమైన భాషతో సోమిరెడ్డిని తిట్టి పోయడం ఆరంభించాడు. ఆయన వేలకోట్లు సంపాదించి విదేశాల్లో దాచిపెట్టాడని అంటూ తప్పుడు డాక్యుమెంట్లతో అర్థంలేని ఆరోపణలతో నానా రచ్చ చేశాడు. ఆ విషయంపై సోమిరెడ్డి కేసు పెట్టడంతో అసలు నిజాలు బయటపడ్డాయి. అదంతా కాకాణి కుట్ర అని తేలిపోయింది. కేసు విచారణలో వుండగానే, కాకాణి మంత్రిగా వున్న తరుణంలో నెల్లూరు కోర్టులో దొంగలు పడి కేవలం కాకాణి – సోమిరెడ్డిలకి సంబంధించిన కాగితాలని మాత్రమే ఎత్తుకుపోవడం మరో మిస్టరీ.

ఇక అధికారపార్టీ శాసనసభ్యుడిగా, మంత్రిగా ఆయన ఆగడాలకు, దురాగతాలకు, దోపిడీలకు హద్దేలేదు. ఇసుక, మట్టి, గ్రావెల్, క్వార్జ్.. ఇలా సంపాదనకి కాదేది అనర్హం అన్నట్లుగా సహజ వనరుల దోపిడీలో ముందు వరసలో నిలిచాడు. ప్రశ్నించిన సోమిరెడ్డిపై హిజ్రాలని ఉసికొల్పాడు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడంలో ఆరితేరాడు. ఇదేక్రమంలో దళితుల భూములని కూడా ఆక్రమించుకున్నాడు. అక్కడా సోమిరెడ్డి అడ్డుకోవడంతో తిరిగిచ్చేశాడు. తనకి గిట్టనివారిని, తనని ఎదిరించిన వారినీ అక్రమకేసులలో ఇరికించాడు. తనపై వార్తలు రాసిన మీడియాపై ధ్వజమెత్తాడు. వారిపై ఒత్తిడి తెచ్చి బెదిరించాడు.

### మేకపోతు గాంభీర్యం..!

అనుమతులు లేకుండా అక్రమ క్వార్జ్ తవ్వకాలు జరిపారంటూ కాకాణితో పాటు ఆయన దోపిడీ భాగస్వాములపై కేసు నమోదయ్యింది. ఈ కేసులో కాకాణి పేరుని ఏ-4గా పోలీసులు చేర్చారు. విచారణకి రావలసిందిగా ఆయనకి నోటీసులు ఇచ్చారు. పిలిచినప్పుడు రాకపోవడంతో నెల్లూరు, హైదరాబాదులోని ఆయన ఇళ్ళకి నోటీసులు అతికించారు. అప్పటికీ మనిషి పత్తా లేకపోవడంతో, ఆయన కోసం వెతకడం ప్రారంభించారు. ఇప్పటికింకా ఆయన దొరకలేదు. తాను ఎక్కడికీ వెళ్లలేదని, అరెస్టులకు భయపడేది లేదని, తాము అధికారంలోకి రాగానే తనపై అక్రమకేసులు పెట్టిన పోలీసుల బట్టలు ఊడదీస్తానని, తమ నాయకుడి తరహాలో బీరాలుపలుకుతూ సామాజిక మాధ్యమాల ద్వారా మాత్రమే కాకాణి అప్పుడప్పుడూ ప్రత్యక్షమవుతున్నాడు. ఆయన నేరం చేసినట్లు ఆధారాలు వున్నాయి కాబట్టి కాకాణికి బెయిలు ఇవ్వలేమంటూ హైకోర్టు ఆయన బెయిలు అభ్యర్థనని తిరస్కరించింది. ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నాడు. పోలీసు శాఖవారు మాత్రం ఆయనపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. దేశం విడిచిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆరు బృందాలుగా ఏర్పడి హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై నగరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ముమ్మరంగా గాలిస్తున్నారు. అక్రమ మైనింగ్ కేసుతో పాటు మరికొన్ని కేసులు కూడా కాకాణిని వెంటాడుతున్నాయి. పోలీసులు ఆయనని వేటాడుతున్నారు. కాకాణి మాత్రం కలుగులో దాక్కున్నాడు.

"అడుసు తొక్కనేల... కాలు కడుగనేల"...!

# నయనానందకరం.. కోదండరాముని కల్యాణం



తోటపల్లిగూడూరు మండలం ఈదూరు గ్రామంలో వెలసివున్న హనుమత్ లక్ష్మణ సీత సమేత శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఈనెల 6న శ్రీరామనవమి ఉత్స వాలు నయనానందకరంగా జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవారిని, ఇతర దేవతామూర్తులను శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రావి మోహన్‌చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తరించారు. వేదపండితులు ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్‌ను ఆశీర్వదించారు.

# మంచి జీవనశైలిని అలవరచుకోవాలి

## విద్యార్థులకు భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉద్బోధ



విద్యార్థులు చిన్ననాటి నుంచి ఆరోగ్యం పై దృష్టిపెట్టాలని, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరచుకోవాలని, ఉన్నతమైన లక్ష్యాలతో యువత ముందడుగు వేయాలని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. వెంకటా చలంలోని స్వర్ణభారత్ విద్యామందిర్‌లో ఆయన ఈనెల 7న విద్యార్థులతో మాట్లా డారు. ఈ సందర్భంగా వారికి ఎన్నో విలు వైన విషయాలను తెలియజేశారు. విద్యా ర్థులు చదువుపై బాగా శ్రద్ధ పెట్టాలని, ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టపోయేది ఏమీ లేదని చెప్పారు. దేశంలో ఊబ కాయం పెరుగుతున్న సంగతిని గుర్తుచేస్తూ, దీనివల్ల వివిధ రకాల అనారోగ్యాలు వస్తా యని చెప్పారు. ఇప్పుడు విద్యార్థులుగా ఉన్న మీరే ..రేపటి దేశ నిర్మాతలన్నారు. మీరంతా ఇప్పటినుంచే ఆరోగ్యంపై దృష్టి పెట్టి, భవిష్యత్తును కాపాడుకోవాలని, అప్పుడే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరు కోగలరని సూచించారు. 'ఉదయాన్నే నిద్ర లేవాలి. సూర్యాస్తమయానికి పనులు పూర్తి చేసుకోవాలి. వ్యాయామం చేయాలి. యోగా, నడక వంటివి రోజువారి చర్యల్లో భాగం చేసుకోవాలి. ఆటలు ఆడుకోవాలి. అప్పుడు మనసు ఉల్లాసంగా ఉంటుంది. వీలైనంతవరకు ఇంటిలో తాజాగా వండిన ఆహారాన్ని తినాలి. బయట తిండి మంచిది కాదు. బర్గర్లు, పిజ్జాలు వంటి పాశ్చాత్య ఆహారం మన వంటికి మంచిది కాదు' అని ఆయన వివరించారు. చిన్న ప్పటి నుంచే క్రమశిక్షణను అలవర్చుకుని విలువలు పాటించాలన్నారు. పక్కవారికి చేయదగ్గ సాయం చేయాలన్నారు. కుటుంబసభ్యులతో, స్నేహితులతో తగి నంత సమయం గడపాలని, చదువుతో పాటు ఇతర అంశాల్లో కూడా నైపుణ్యం సాధించాలని సూచించారు. అవి పాటలు కావచ్చు, ఆటలు కావచ్చు, నాట్యం కావచ్చు, సంగీతం కావచ్చు, డ్రాయింగ్ కావచ్చు, ఇలా ఏదైనా ఒక కళలో పరి ణతి సాధిస్తే మంచి గుర్తింపు వస్తుంద న్నారు. ముఖ్యంగా కన్నతల్లిని, జన్మ భూమిని, గురువులను, మాతృదేశాన్ని ఏనాటికీ మరువకూడదన్నారు. తల్లిదం డ్రులు దైవంతో సమానమని, వారు మన కోసం ఎంతో కష్టపడతారని, వారికి రుణ పడి ఉండాలని, వారి బాగోగులను చివరి వరకూ చూసుకోవాలని, ఇది ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఆయన విద్యార్థులకు బోధిం చారు. ప్రతిఒక్కరూ తెలుగులో మాట్లాడా లని, ఆ తర్వాత పొరుగు భాష, ఆ తర్వాత హిందీ, ఆ తర్వాత ఆంగ్లం నేర్చు కోవచ్చు అన్నారు. బ్రో లాంటి పిలుపులు వద్దని, చక్కగా అన్నా, అక్క, చెల్లి అంటూ వరుసలతో పిలుచుకోవాలని ఆయన ఇలా ఎన్నో మంచిమాటలు చెప్పారు.

# యానాదులకు ఆదరహస్తం.. 'బాలసంస్కార కేంద్రం'






నెల్లూరులోని సింహపురి వైద్యసేవాసమితి వారు జయభారత్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవలో భాగంగా ఏర్పాటుచేసిన బాలసంస్కార్ కేంద్రాలు, అమాయకులైన గిరి జనులకు, ముఖ్యంగా యానాదులకు ఆదరహస్తంగా ఉంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. జిల్లాలోని సుమారు 54 యానాదుల కాలనీలలో వారు ఈ బాలసంస్కార్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. సుమారు 1200 మంది యానాదులకు విద్యా బుద్ధులు నేర్పుతున్నారు. సమాజానికి దూరంగా ఉంటున్న వారి జీవన విధానాల్లో మార్పులు తీసుకువస్తూ, వారికి సామాజిక సంస్కారాన్ని, దేశభక్తిని బోధిస్తున్నారు. జిల్లాలోని వెంకటాచలం మండలం ఎర్రగుంట గిరిజనకాలనీలో నిర్వహిస్తున్న బాల సంస్కార్ కేంద్రంలో ఈనెల 6న జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఆర్ఎస్ఎస్ నాయకులు, పెద్దసంఖ్యలో యానాదులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు.. సింహపురి వైద్యసేవా సమితి ప్రధాన కార్యదర్శి నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి పాల్గొని, అనాదిగా సమాజంలో వెనుకబడివున్న ఆదిమజాతి తెగకు చెందిన గిరిజనులు, యానాదులకు బాలసంస్కార్ కేంద్రాలు చేస్తున్న విశిష్టసేవలను వివరించారు. దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ సుమారు ఒకటిన్నర లక్షల సేవా ప్రాజెక్టులను నిర్వహిస్తోందని తెలిపారు. ప్రత్యేకించి నెల్లూరులో సింహపురి వైద్యసేవాసమితి వారు జిల్లాలోని నిరుపేదలైన యానాదులకు వైద్యచికిత్సలను అందించేందుకు జయభారత్ ఆసుపత్రిలో ప్రత్యేకంగా 10 పడకల విభాగాన్ని నిర్వహించడం ఆ సేవాసమితి సేవాభావానికి నిదర్శన మన్నారు. చదువు సంస్కారాలు లేక బలహీనవర్గాలుగా ఉన్న యానాదులకు విద్యను బోధించి, వారిని సంస్కారవంతంగా తీర్చి దిద్దేందుకు, వారిని విద్యావంతులను చేసేందుకు బాలసంస్కార్ కేంద్రాలు చేస్తున్న కృషి అపూర్వమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు నరసయ్య, ప్రాజెక్ట్ అధికారి సుబ్బారావు, గిరిజన నాయకులు పొట్లూరు శ్రీనివాసులు, విజయలక్ష్మి, ఉపాధ్యాయిని శిరీష తదితరులు పాల్గొన్నారు. తొలుత బాలసంస్కార్ విద్యార్థులు చేసిన యోగాస నాల ప్రదర్శన అందరి అభినందనలు అందుకుంది.

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ..బీజేపీ

## --- ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు ---



దేశంలో కేవలం రెండు సీట్లతో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించడం గర్వకారణమని బీజేపీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నెల్లూరు లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగింది. పార్టీ సీనియర్ నాయకుడు.. ఆర్టీసీ జోనల్ ఇన్‌ఛార్జి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ ఇంత గొప్పగా ఎదగడం పార్టీ కార్యకర్తల నిబద్ధతకు నిదర్శనమన్నారు.

తొలుత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, ముక్కు రాధాకృష్ణగౌడ్, చిలకా ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజ్ఞానం కోసం..శ్రీసిటీలో
# ఉచిత వేసవి శిక్షణా శిబిరం


ఈ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి శ్రీసిటీలో ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. 9, 10, 11వ తరగతుల్లో పరీక్షలు పూర్తయిన విద్యార్థులు విజ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ప్రత్యేక కోర్సులతో దీనిని రూపొందించారు. మే 30వతేదీ వరకు అన్ని పని దినాలలో ఈ శిబిరం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా ఈ శిబిరంలో కంప్యూటర్ కోర్సు, ఇంగ్లీష్ గ్రామర్, వ్రాత నైపుణ్యాలు, గణిత సూత్రాలు, పోటీ పరీక్షల మెళకువలు, జనరల్ నాలెడ్జి, ప్రపంచ వార్తలు తదితర అంశాలను పొందుపర్చారు. శారీరక శిక్షణలో భాగంగా యోగా, కరాటే, స్పోర్ట్స్, గేమ్స్ నేర్పించనున్నారు. ఇవికాక క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహిస్తారు. ప్రాథమిక చికిత్సలపై కూడా అవగాహన కల్పిస్తారు. శ్రీసిటీ ఫైర్ స్టేషన్, డానియలీ పరిశ్రమ సమీపంలోని శ్రీసిటీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొనే వారందరికీ ఉచిత భోజన వసతి మరియు శ్రీసిటీ జీరో పాయింట్, చెరివి కూడలి నుంచి ఉచిత వాహన సదుపాయం కల్పిస్తున్నారు. కాంప్లిమెంటరీ కిట్‌లను ప్రతి విద్యార్థికి పంపిణీ చేస్తారు. చివరగా శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలపై అవగాహన, పరిశ్రమల సందర్శనతో ఈ శిబిరం ముగుస్తుంది. శ్రీసిటీ మరియు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరంలో చేరదలిచిన వారు 8331035857 నెంబర్‌ను సంప్రదించాలని శ్రీసిటీ ఫౌండేషన్ అధికారులు కోరుతున్నారు.

# ధ్రువకుమార్‌కు మాడభూషి సన్మానం



పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్లుగా, చిన్న వయసులోనే తన గాన మాధుర్యంతో అందరితో ఆకట్టుకుంటున్న ధ్రువ కుమార్‌రాజ్‌ను ఇటీవల ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న ధ్రువకుమార్‌రాజ్ భగవద్గీత శ్లోకాలను, త్యాగయ్య కీర్తనలను, మా తెలుగుతల్లికీ మల్లెపూదండ వంటి గీతాలను అద్భుతంగా పాడి అందరినీ ఆకట్టుకుంటున్న సంగతి తెలిసిందే. ఆ బాలుని ప్రతిభను మెచ్చుకుంటూ జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు కూడా అభినందించారు. ఈ సందర్భంగా మాడభూషి మాట్లాడుతూ, చదువుతోపాటు సంగీతం తదితర కళలపె చిన్నారులు ఆసక్తిని పెంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.

# గ్యాస్‌ధర..భగ్గు భగ్గు!



అసలే నిత్యావసర ధరలు పెరిగిపోయి సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటుంటే, ఆ తిప్పలు చాలవన్నట్లు కేంద్రం వంట గ్యాస్ ధరను కూడా పెంచేసింది. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లుగా, సిలిండర్‌కు 50 రూపాయల వంతున పెంచడం పట్ల సర్వత్రా ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేంద్రం వడ్డింపుతో గ్యాస్ ధర 803 నుంచి ఒక్కసారిగా 853 రూపాయలకు పెరిగిపోవడంతో జనం అయోమయంలో పడిపోయారు. ఈనెల 8 నుంచే ఆ పెంచిన ధరలు అమల్లోకి వస్తాయని కూడా కేంద్రం ప్రకటించేసింది. ఉజ్వల సిలిండర్లకు కూడా ఈ పెంపుదల వర్తిస్తుందని పేర్కొనడంతో, ఆ సిలిండర్ల ధర 503 నుంచి 553 రూపాయలకు చేరింది. ఈ గ్యాస్ వడ్డింపుల మంటలపై నెల్లూరు నగరంలోనూ ప్రజలు, ప్రజాసంఘాలు ఆందోళనలు చేపట్టాయి.

# గ్రంధి సేవలకు గుర్తుగా.. నిలువెత్తు విగ్రహం

**● ఆవిష్కరించిన ఇద్దరు మంత్రులు**



మునిసిపల్ ఛైర్మెన్‌గా కావలి పట్టణానికి సుదీర్ఘ కాలం సేవలందించిన నేత, ఆర్యవైశ్య ప్రముఖుడు.. దివంగత గ్రంధి యానాదిశెట్టి నిలువెత్తు విగ్రహాన్ని కావలి పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు కూడలిలో ఏర్పాటుచేయడం గ్రంధి సేవలకు మంచి గుర్తింపు అనే చెప్పవచ్చు. ఆ విగ్రహాన్ని ఇద్దరు మంత్రులు ఆవిష్కరించి, గ్రంధి ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. గ్రంధి విగ్రహాన్ని తన సొంతనిధులతో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తయారుచేయించగా, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చేతుల మీదుగా ఆవిష్కరించడం విశేషం. ఈనెల 8న కావలిలోని అనేకమంది ప్రముఖులు, ప్రజల సమక్షంలో గ్రంధి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది.

# భూసార పరీక్షల్లో.. నెల్లూరుకు జాతీయస్థాయి గుర్తింపు

జిల్లాలోని పంటపొలాల్లో భూసారం ఎలా ఉందో పరీక్షించి, ఎప్పటికప్పుడు రైతులకు తగు సూచనలు సలహాలు ఇస్తుండడంలో నెల్లూరులోని భూసార పరీక్షా కేంద్రం జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం విశేషం. భూసార పరీక్షల్లో ఒక మంచి ప్రయోగశాలగా నెల్లూరు కేంద్రం పనిచేస్తోందని, జాతీయ సంస్థగా ఉన్న బోర్డ్ ఆఫ్ టెస్టింగ్, కాలిబ్రేషన్ ప్రయోగశాల సంస్థ తన పరిశీలనలో వెల్లడించింది. నెల్లూరు భూసార పరీక్షల కేంద్రం జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలగా ఉందంటూ మెచ్చుకుంది. ఆ మేరకు ఆ సంస్థ నుంచి తమకు ధృవీకరణ పత్రం కూడా అందినట్లు కేంద్రం ఏడీఏ కన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# జిల్లా జడ్జి యామిని.. బదిలీ

**కొత్త జడ్జిగా శ్రీనివాస్**

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జిల్లాకు విశేష సేవలందించిన సి.యామిని తాజాగా జరిగిన బదిలీల్లో భాగంగా, నెల్లూరు జిల్లా నుంచి కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమేరకు హైకోర్టు నుంచి ఈనెల 7న ఉత్తర్వులు వచ్చాయి. న్యాయ వ్యవహారాల్లో, లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో ఆమె విశిష్టమైన సేవలందించి, జిల్లాను అగ్రస్థానంలో నిలిపారు. ఆమె ఇక్కడ నుంచి బదిలీ కావడంతో, ఆ స్థానంలో అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జి.శ్రీనివాస్ నెల్లూరు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

# అస్తవ్యస్థ జీవనశైలితోనే అనారోగ్యాలు

**డాక్టర్ పసుపులేటి వసుమతి**




ప్రస్తుత సమాజంలో అస్తవ్యస్థమైన జీవనశైలి వల్ల లేనిపోని అనారోగ్యాలు కలుగుతున్నాయని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పసుపులేటి వసుమతి చెప్పారు. సక్రమమైన జీవన విధానం, సరైన ఆహార నియామాలు, తగినంత వ్యాయామం చేయడంవల్ల ప్రజలు ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. ముఖ్యంగా తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈనెల 7న నెల్లూరులోని నెహ్రూ యువకేంద్ర, పీఎంపీల అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చైతన్యపురిలోని రిచ్ నర్సింగ్ కాలేజీలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, తల్లీ-బిడ్డ ఆరోగ్యం దేశ భవిష్యత్తుకు, మానవజాతి మనుగడకు ఎంతో అవసరమన్నారు. శారీరక శ్రమ కలిగినప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని, అందుకే శారీరక వ్యాయామం తప్పనిసరని ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూ యువకేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ ఆకుల మహేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం డాక్టర్ వసుమతిని నర్సింగ్ కాలేజీ సిబ్బంది, పీహెచ్‌పీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ నాయకులు అనుముల జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, నర్సింగ్ కాలేజీ కరస్పాండెంట్ దుర్గారెడ్డి, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలుకు కేంద్రాలు

జిల్లాలో జొన్న పంటను కొనుగోలు చేసేందుకు, జొన్నలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లా పౌరసరఫరలా సంస్థ జిల్లా మేనేజర్ అర్జున్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆత్మకూరు, పొదలకూరు, కలువాయి, చేజర్ల మండలాల్లో జొన్న పంట సాగైందని, రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## టూకీగా...



### సీతారామపురంలో ఆరోగ్య అవగాహనకు ర్యాలీ

ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా ఈనెల 7న మండల కేంద్రమైన సీతారామపురంలో స్థానిక వైద్యాధికారిణి ఏ.స్వప్న ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహనకు ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యసూత్రాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని ఆమె కోరారు. ఆరోగ్య కార్యకర్తలు, వైద్యసిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

### ఆత్మకూరులో శక్తి యాప్‌పై అవగాహన

ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురు విద్యార్థినులు, మహిళలకు పోలీస్ కానిస్టేబుళ్ళు కోటమ్మ, సునీతలు ఈనెల 8న శక్తి యాప్‌పై అవగాహన కలిగించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ, మహిళలకు శక్తి యాప్ ఏవిధంగా రక్షణగా ఉంటుందో వివరించి, ఆ యాప్‌ను వినియోగించుకోవాల్సిందిగా సూచించారు.

### ఇందుపూరులో పేకాటరాయుళ్ళ అరెస్ట్

అల్లూరు మండలం ఇందుపూరులో ఈనెల 6న పోలీసులు దాడులు చేసి అయిదుగురు పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, 3500 రూపాయలను కూడా స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు అల్లూరు ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

### మోటుచింతలపాళెంలో మామిడితోట దగ్ధం

వింజమూరు మండలం మోటుచింతలపాళెం గ్రామంలో ఈనెల 6న ప్రమాదవశాత్తూ జరిగిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ మామిడితోటలో కొంతభాగం అగ్నికి ఆహుతైపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందడంతో, వారు వెళ్ళి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదం వల్ల సుమారు 5 లక్షల రూపాయల దాకా నష్టం జరిగినట్లు సమాచారం.

### కోడూరు బీచ్‌లో పర్యాటకుల సందడి

తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు బీచ్ ఈనెల 6న ఆదివారం రోజున పర్యాటకుల సందడితో కళకళలాడింది. అటు ఆదివారం, ఇటు శ్రీరామనవమి పండుగ కావడంతో బీచ్‌కి సందర్శకులు పెద్దసంఖ్యలో వచ్చారు. తోటపల్లిగూడూరు ఎస్‌ఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులు బీచ్ వద్ద గస్తీ నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

### వరికుంటపాడు వద్ద కెమికల్ లారీ బోల్తా

వరికుంటపాడు జాతీయ రహదారిపై వెంకటేశ్వరాలయం వద్ద ఈనెల 6న ఓ కెమికల్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. విశాఖ నుంచి కడపకు కెమికల్ ఆయిల్‌ను తీసుకువెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. లారీ నుంచి దట్టమైన పొగ వస్తుండడంతో స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు రాకుండా చర్యలు తీసుకున్నారు.

### వేపినాపిలో ఫైలేరియా బాధితులకు చేయూత

రాపూరు మండలంలోని వేపినాపి గ్రామంలోని పీహెచ్‌సీలో ఈనెల 7న ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు అవసరమైన వస్తుసామగ్రిని డాక్టర్ ప్రమీల రాజకుమారి అందజేశారు. ఫైలేరియా బాధితులు తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలను ఆమె వివరించారు.

### రాపూరు వద్ద అడవికి నిప్పు పెట్టారు


ఎవరో గుర్తుతెలియని దుండగులు రాపూరు వద్ద అడవికి నిప్పు పెట్టారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే అటవీశాఖ బీట్ అధికారి షఫీ అగ్నిమాపక శాఖ వారికి తెలియజేయడంతో, వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అడవికి నిప్పు పెట్టిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ అధికారులు చెప్పారు.

### ట్రాక్టర్ల ట్రక్కులు అపహరించే దొంగ దొరికాడు

ట్రాక్టర్ల ట్రక్కులు అపహరించుకుపోతున్న బోగోలు మండలం ఏబీకండ్రిగకు చెందిన షేక్ మస్తాన్‌ను ఇటీవల పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. బిట్రగుంట ఎస్‌ఐ ఆధ్వర్యంలో నిందితుడి వద్దనుంచి రెండు ట్రాక్టర్ ట్రక్కులను, చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్ ఇంజన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

# 'రామరాజ్యం'.. ప్రభుత్వాలకు ఆదర్శం కావాలి - వెంకయ్యనాయుడు

శ్రీరాముడు అందరికీ మార్గదర్శకం కావాలి. అదేవిధంగా ప్రభుత్వాలకు కూడా రామరాజ్యమే ఆదర్శం కావాలి'.. అని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా ఆయన తన స్వస్థలమైన చౌటపాళెం, అత్తగారి గ్రామమైన శ్రీరామపురంలలో ఉన్న శ్రీ కోదండరామాలయాలను దర్శించుకున్నారు. శ్రీరామపురం శ్రీ కోదండరామాలయంలో వైభవంగా జరిగిన శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవంలో ఆయన సతీమణి ఉషమ్మ, మనుమడు విష్ణుబాబు, సాత్విక దంపతులతోపాటు, కుమార్తె దీపా వెంకట్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ రెండు గ్రామాల ప్రజలతో వెంకయ్య ముచ్చటించారు. సమాజంలో నేటికీ అక్కడక్కడా కనిపిస్తున్న వివక్షలు, అసహనం వంటి సామాజిక రుగ్మతలకు శ్రీరాముని ఆదర్శాలే సరైన పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి గ్రామంలోనూ సాయంత్రం వేళల్లో రామాయణం పారాయణ జరగాలని ఆయన ఆకాంక్షించారు. అవినీతి, అన్యాయం, అక్రమం, అసమానతలకు తావులేని ఆదర్శ రాజ్యంగా శ్రీరాముని పాలన గురించి మన పెద్దలు తెలియజేశారని ఆయన అంటూ, ప్రభుత్వాలు సైతం రామరాజ్యాన్ని ఆదర్శంగా తీసుకుని పాలన సాగిస్తే ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లుతారని తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో అక్కడక్కడా కనిపిస్తున్న ఉద్రిక్తతలు, అశాంతి, అత్యాచారాలకి పరిష్కారం రామరాజ్యమే అని ఆయన సూచించారు. శ్రీరాముడు, ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని మాత్రమే పాటిస్తూ, ప్రతి అడుగులోనూ ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన పురుషోత్తముడని తెలిపారు. రాముని ఆదర్శంగా తీసుకుని సత్ప్రవర్తన, సద్బుద్ధి, సదా



చారంతో పిల్లలు, పెద్దలు వికసిత భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. విద్యార్థులకు పాఠ్య ప్రణాళికలో భాగంగా రామాయణాన్ని బోధించాలని కూడా వెంకయ్యనాయుడు సూచించారు.



# చిన్నారులు ఇష్టపడేవిధంగా.. పార్కులు - మంత్రి నారాయణ

నెల్లూరు నగర సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. మంగళవారం 44వ డివిజన్‌లో పునరుద్ధరించిన మహబూబ్‌ఖాన్ పార్కును మంత్రి నారాయణ చిన్నారుల హర్షాతిరేకాల మధ్య ప్రారంభించారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల చిన్నారులు తోడు రాగా పార్క్ అంతటా కలియతిరిగి చిన్నారుల ఆనందంలో మంత్రి పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో దాదాపు 100 పార్కులను అభివృద్ధి చేశామని,



అయితే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం వాటి నిర్వహణ చేపట్టకపోవడంతో ఆట వస్తువులు పాడైపోయి, పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రజల ఆహ్లాదం, ఆనందం కోసం గ్రీన్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, చిన్నారులు ఇష్టపడేవిధంగా పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. మొదటగా మహబూబ్‌ఖాన్ పార్కును ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. అభివృద్ధి చేసిన పార్కులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, పార్కుల సక్రమ నిర్వహణకు వాచ్‌మెన్‌ను కూడా నియమిస్తామన్నారు. ఈనెల 23 నుండి విద్యార్థులకు వేసవి సెలవులు వస్తున్నందున, ఆ లోపుగా నగరంలోని అన్ని పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే నగరంలోని అన్ని మున్సిపల్ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.




జననం: 16.01.1950 నిర్యాణం : 08.04.2025

## ఉత్తరక్రియలు

మా ఇంటి దీపం, మా కంటి రూపం
సౌజన్యమూర్తి, ఆత్మీయదీప్తి
**శ్రీమతి ఉచ్చూరు సుజాతమ్మ గారు**
(కీ॥శే॥ ఉచ్చూరు నారాయణరెడ్డి గారి సతీమణి)
తేది. 08.04.2025, మంగళవారం
రాత్రి 9.30 గంటలకి శివైక్యం చెందారు.
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

- కుటుంబసభ్యులు

**ఉత్తరక్రియలు :**
వారి పెద్దకర్మ తేది. 17.04.2025 గురువారం
ఉదయం 11.00 గంటలకు నెల్లూరుజిల్లా
వాకాడు గ్రామంలోని వారి స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com